## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మ, యా-యాజ్‌దాన్, లా ఇలాహ్**
**ఇల్లిల్లాహ్, ఓ గాడ్, ఫాదర్ ఇన్ హెవెన్.**

పరమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము,
అపవిత్రమును అగు
మా ప్రతి మాటకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకు
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకు,
సమస్త కపటవర్తనమునకు,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకు,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చిన
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాప పడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపమలన్నింటికిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని
మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలలమగుచున్న
మమ్ములను క్షమింప వేడుకొనుచున్నాము.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/
RNP/789/2006-08, Dt.25-8-2006

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్ బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :7 సంచిక:2 హైదరాబాద్ మే 2008 పేజీలు: 40

Please visit us @ www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ. 100/-

### రవీంద్ర భారతిలో అవతారుని

# My wish సంబరాలు

మెహెర్‌బాబా My wish - నా ఆకాంక్ష అని తన సందేశాన్ని ఇచ్చి 2008 మే నాటికి 50 సంవత్సరాలు నిండుతున్నాయి.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 2008 మే 25న పెద్ద ఎత్తున సంగీతభరిత- సహవాస్- గోష్టిని **"అవతారుని ఆకాంక్ష"** స్వర్ణోత్సవ వేడుకలు- ఘనంగా జరిపేందుకు తగిన ఏర్పాటు చేసినట్లు స్థానిక సెంటర్ కార్యదర్శి పి. రాజేంద్ర మెహెర్ తెలిపారు.

తెలుగు ప్రాంతీయులకు ఇదొక అరుదైన అందివచ్చిన అవకాశం.

**ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితులైన సోదరద్వయం సోరబ్- రుస్తుంలు (పూనే) ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు.**

**సోరబ్-రుస్తుం- కవలలు- మెహెర్‌బాబా సోదరుని కుమారులుగా బాబా ప్రేమికులు చాలామందికి తెలుసు.**

**2008 మే 25న సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసారు.**

బాబా ప్రేమికులు సాయంత్రం 4.30 ని॥లకే తమ సీట్లలో కూర్చుని నిర్వాహకులతో సహకరించాలని రాజేంద్రమెహెర్ కోరారు.

కవ్వాలీలు- ఘజల్స్‌తో కూడిన ఈ ప్రత్యేక అరుదైన కార్యక్రమానికి బాబా ప్రేమికులు అందరూ తప్పక హాజరుకావాలని ఆయన అన్నారు.

## ఉత్తర ప్రత్యుత్తరాలకు

మా అడ్రస్సు- ఎడిటర్, మెహెర్‌బాబా, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్-500 087 ఫోన్: 040-27860079, 99595-53218





# లోపలి పేజీలలో...


| | | | |
|---|---|---|---|
| 1. సంపాదకీయం | 5 | 6. కె.కె. శ్రద్ధాంజలి | 24-25 |
| 2. మనస్సు-హృదయం | 6-12 | 7. లార్డ్ మెహెర్ | 26-29 |
| 3. ఫ్రేనీ నాలావాలా | 13-18 | 8. బాటసారులు | 30-31 |
| 4. బాబా శతకం | 19 | 9. మా మాటలు | 32-37 |
| 5. చెన్నై సహవాస్ | 20-23 | 10. జీవిత సభ్యత్వం | 38 |


## మెహెర్ బాబా సందేశం

The trouble with you is that you don't leave it entirely to Me. If you have one hundred percent faith in Me and leave it entirely to Me the burden will automatically fall on My shoulders and the pressure of the burden on My shoulders would make Me remember inspite of the pressure of My universal work with which I am engrassed.

P. 84, Surrendering to Him - by Rhode Dubashi

*–తెలుగు అనువాదం సంపాదకీయంలో*

గౌరవ సంపాదకులు

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**040-27860079**

వ్యవస్థాపకులు:

**దశిక ప్రసాదరావు**

040-65699611

040-64542370

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# మెహెరాబాద్‌లో డి- హాస్టలులో వసతి

మెహెర్‌బాబా సమాధి దర్శనార్థం అహ్మద్‌నగర్ జిల్లాలోని మెహెరాబాద్‌కు వెళ్ళేవారు- సాధారణంగా దిగువ మెహెరాబాద్‌లో వున్న వసతి సౌకర్యం 'సి' లేదా 'డి' హాస్టలు లేదా ధర్మశాలలోని కొన్ని గదులను వినియోగించుకుంటున్నారు. ఇందుకోసం కేవలం పది రూపాయలు 1976 నుండి 'విరాళం' రూపేణా వసూలు చేస్తున్నారు.

కాగా, 2008 మార్చి 16న మెహెర్‌బాబా ట్రస్టు సమావేశంలో ఈ వసతి సౌకర్యపు రేట్లను సవరిస్తూ - రు.10/- నుండి రూ.20/- పెంచుతున్నట్లు ఒక నిర్ణయం తీసుకున్నామని ప్రకటించారు. మెహెర్‌బాద్‌లో వసతి కోరువారు తమ పేర్లు- ఇతర వివరాలు ముందుగా తెలియజేసి రిజర్వుచేయించుకోవాలని, లేనిఎడల రూ.20/- బదులు రూ.50/- చెల్లించాలని సమావేశంలో తీర్మానించినట్లు జాల్ దస్తూర్, ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

**అమరతిథి:**

అమరతిథికి హాజరయ్యే బాబా ప్రేమికుల సంఖ్య అధికమయింది. గత సంవత్సరాలతో పోల్చితే, అమరతిథికి హాజరయ్యే బాబా ప్రేమికులు తమ వసతి సౌకర్యం గురించి ఏ మాత్రం ముందుగా తెలియజేయకుండా ఆఖరిక్షణంలో వచ్చేవారి సంఖ్య కూడా గత సంవత్సరాలతో పోల్చితే గణనీయంగా పెరిగిందని ట్రస్టు సభ్యులు జాల్.పి.దస్తూర్ పేర్కొన్నారు.

ఇలాంటి వారి నుండి ప్రస్తుతం రూ.60/- విరాళంగా వసూలు చేస్తున్నారు.

కాగా, ఈ మొత్తాన్ని రాబోయే అమరతిథి నుండి రూ.100/-కు పెంచనున్నట్లు జాల్ తెలిపారు.

# వచ్చే సంచికలో

మెహెర్‌బాబాతో ఎంతో కాలంగా మరెంతో సన్నిహితంగా మెలిగినవారు శ్రీ ఎల్.బి.థాడే, అహ్మద్‌నగర్, అలాగే డా॥ దిగంబర్ గాడేకర్. వీరిద్దరితో మెహెర్‌బాబా ప్రతినిధి ఇటీవల కలిసి అనేక అసక్తికర విషయాలను సేకరించారు.

కాగా ఆ విశేషాలన్నింటిని రాబోయే సంచికలలో మీకు ప్రత్యేక శీర్షికలుగా అందించనున్నాం.

దయచేసి పరిశీలించండి. **-ఎడిటర్**





సంపాదకీయం

# భారం బదిలీ

మెహెర్‌బాబా మౌనంగా వుంటూ రమారమిన ఆరువేల పై చిలుకు సందేశాలు తన ప్రేమికుల కోసం ఇచ్చారు.

నేను ఈ యుగావతారుడ్ని.

మానవరూపంలో వచ్చిన భగవంతుడినని మెహెర్‌బాబా చాలా స్పష్టంగా పలు సందర్భాలలో ప్రకటించారు.

మెహెర్‌బాబాను సాక్షాత్తూ అవతారమూర్తిగా, తమ ఇంటి ఇలవేల్పుగా ఆరాధించే వారెందరో!!

మెహెర్‌బాబా మహత్యాలు చేయనని నిర్ద్వందంగా పలుమార్లు చెప్పారు.

ఈ సందర్భంగా ఈ సంచికలోని తొలి పేజీల్లో గల మెహెర్‌సందేశ్‌ను ఒకసారి పరిశీలిద్దాం.

"మీ సమస్యలు ఏమైనా వుంటే వాటిని నాకు అప్పజెప్పండి.

మీరు బాధ పడొద్దు. ఐతే వచ్చిన చిక్కల్లా ఏమంటే, మీరేనాడూ మీ సమస్యల్ని నాపై విశ్వాసం వుంచి, వాటినన్నింటినీ పూర్తిగా నాకు అప్పజెప్పరు.

మీరు గనుక నాపై నూరు శాతం నమ్మకంతో ఆ సమస్యల భారాన్ని అప్పజెప్పితే, ఆ భారం ఆటోమేటిక్‌గా నా భుజస్కందాలపై పడుతుంది.

విశ్వమానవాళి కార్యక్రమంలో నేనెంత పని ఒత్తిడిలో వున్నా, నా భుజాలపై మీరుంచిన సమస్యల బరువు వల్ల, మీ సమస్యలను నేనెప్పటికీ మరువను.

కాబట్టి మరింతగా ఆలోచించక, అతిగా సంశయించక, మీ సమస్త సమస్యల చిట్టాను నాకు అప్పజెప్పి, మీరు నిశ్చింతగా వుండండి!!

ఆనందంగా ఉండండి!!

నా సహాయం సంపూర్తిగా మీకు లభిస్తుంది.

ఇదీ బాబా ఇచ్చిన భరోసా!!

ఇంక చింత ఏల!!

## మెహెర్‌బాబా సందేశం

# మనస్సు-హృదయం

-బి. రామకృష్ణయ్య

భగవంతుడు నోటి మాటల భాషను వినడు. జపతప ధ్యానాదులనే మనసు భాషను కూడా వినడు. కేవలం హృదయ భాషను మాత్రమే వింటాడని బాబా సూచించారు. అది హమీర్‌పూర్ సందర్శన సందర్భంగా చెప్పారు. అలాగే ఆంధ్ర పర్యటన సందర్భంగా బాబా ఈ సందేశం యిచ్చారు. "మనసు చెప్పిన మాట వినవద్దు. హృదయం చెప్పేదే చెవి యొగ్గివిను. మనసు చలిస్తుంది- హృదయం చలించదు. మనస్సు భయపడుతుంది. హృదయం స్థైర్యం కలిగి యుంటుంది. మనస్సు సందేహాలకు, తర్కాలకు, సిద్ధాంతాలకు పుట్టినిల్లు- పరిశుద్ధమైన హృదయం ప్రియతముని నివాస స్థానం.

సృష్టిలో 18000 ప్రపంచాలున్నాయని, కొన్నింటిలో బుద్ధి నూటికి నూరు పాళ్ళు పని చేసే వారున్నారని, మిగిలిన వాటిలో అది విభిన్న స్థాయిల్లో పనిచేసేవారున్నారని కాని ఈ భూమిపైననే బుద్ధి (మనస్సు) మరియు హృదయం సమపాళ్ళలో పని చేసే అవకాశం ఉందని బాబా చెప్పారు. అందువల్లనే ఇతర ప్రపంచాలనుండి జీవాత్మలు తరలి వచ్చి ఈ భూమి మీద జన్మిస్తున్నారని అందువల్ల జనాభా పెరగడమే గాక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానము ఉచ్ఛస్థాయికెదిగిందని, ఈ భూమి మీదనే భగవదైక్యము సిద్ధిస్తుందని బాబా చెప్పారు. మనస్సు హృదయం రెండింటిని సమతుల్యంచేసి ఆధ్యాత్మిక పురోగతి కలిగించుటే అవతారుని విశ్వకార్యంలోని ముఖ్యాంశం.





అయితే ఈ మనస్సు ఏమిటి? ఎలా ఉంటుంది?. హృదయం అంటే ఏమిటి? ఎలా ఉంటుంది? ముందు తెలుసుకోవాలి. మనస్సంటే మన తలలో ఉండే భౌతిక భాగమైన మెదడుకాదు. మెదడు మనస్సు పని చేయడానికి, ఉపయోగపడే పరికరం మాత్రమే. అలాగే హృదయం అంటే రక్తాన్ని భౌతిక దేహానికి సరఫరా చేసే రక్తమాంసాలతో తయారు చేయబడిన గుండె కాదు. హృదయం యొక్క అనుభూతులను వ్యక్తం చేయడానికి ఈ భౌతిక దేహంలోని ఒక భాగమైన గుండె పరికరంగా ఉపయోగ పడుతుంది. ప్రతి వ్యక్తికి భౌతిక దేహంతో ఏకమై ఇంకా రెండు శరీరాలుంటాయి. ఒకటి సూక్ష్మ శరీరము. ఇంకొకటి మానసిక శరీరము. ఈ మూడు శరీరాలతో తాదాత్మ్యం చెందిన ఆత్మయే జీవాత్మ లేదా ప్రత్యగాత్మ అనబడుతుంది. ఈ జీవాత్మ అనుభవాల ద్వారా సంస్కారనాశనం చేసుకొని పరమాత్మతో మళ్ళీ ఐక్యమవడానికి చేసే ప్రయాణంలో ఉపయోగించేవే ఈ మూడు శరీరాలు. సూక్ష్మ శరీరం మామూలు కళ్ళకు కనబడదు. భౌతిక దేహాన్ని ఆవహించి దానికి కావలసిన ప్రాణశక్తిని అందిస్తుంది. భౌతిక దేహం పని చేయడానికి విభిన్న ప్రాణులతో కూడిన ఈ చరాచర ప్రపంచం ఎలా ఉందో సూక్ష్మ శరీరానికి సంబంధించి కూడా సూక్ష్మలోకం ఉంటుంది. అది శక్తికి సంబంధించినది. కనిపించకుండా అది కూడా ఈ విశ్వమంతా వ్యాపించి ఉంటుంది. సూక్ష్మ ప్రపంచం నుండే సూక్ష్మ శరీరాలన్నీ శక్తిని గ్రహించి భౌతిక శరీరాలకు విభిన్న స్థాయిల్లో శక్తిని అందిస్తుంటాయి. అలాగే మానసిక లోకం కూడా కనబడకుండా భౌతిక ప్రపంచం సూక్ష్మ ప్రపంచాలతో బాటుగా యావద్విశ్వమంతా వ్యాపించి ఉంటుంది. జీవాత్మలువాడుకునే మానసిక శరీరాలన్నీ మానసిక ప్రపంచంలో అంతర్భాగాలై మానసిక శక్తిని మానసికలోకం నుండి గ్రహించి విభిన్న స్థాయిల్లో జీవాత్మలకందిస్తాయి. భౌతిక దేహపు ఎరుక మాత్రమే కలిగియున్న జీవాత్మలకు సూక్ష్మ, మానసిక శరీరాల ఎరుక ఉండదు కాని సూక్ష్మ మానసిక శరీరాలు భౌతిక దేహంతో కలిసి పనిచేస్తాయి. వాటి ఎరుక లేకున్నా యాంత్రికంగా సహజ సిద్ధంగా అవి పని చేస్తాయి. మరణంలో భౌతిక దేహం మాత్రమే రాలిపోతుంది. కాని సూక్ష్మ, మానసిక శరీరాలు అలాగే ఉంటాయి. భౌతిక దేహానికి వాటితో సంబంధం తెగి పోతుంది. సంస్కారాల ప్రకారం పొందవలసిన అనుభవాలకు అనువైన మరొక దేహాన్ని జీవాత్మ మిగిలిపోయిన సూక్ష్మ మానసిక శరీరాల ద్వారా ధరిస్తుంది.

సంస్కారాలు పలుచబడి జీవాత్మ ఆధ్యాత్మిక మార్గంలో ఎదిగి, భూమికల్లో ప్రవేశించినప్పుడు సూక్ష్మశరీరపు ఎరుక కలిగి ఉంటుంది. బౌతిక దేహం, మానసిక శరీరం కూడా యాంత్రికంగా, సహజసిద్ధంగా సూక్ష్మశరీరంతో బాటు పని చేస్తున్నా జీవాత్మకు వాటి ఎరుక ఉండదు. అలాగే ఐదు ఆరు భూమికలలో ప్రవేశించి మానసిక శరీరంతో వాటి అనుభూతులు పొందే జీవాత్మకు మానసిక శరీరపు ఎరుక మాత్రమే

ఉంటుంది. భౌతిక దేహం మరియు సూక్ష్మశరీరాల ఎరుక ఉండదు. అయినా ఆ రెండు శరీరాలు యాంత్రికంగా సహజ సిద్ధంగా మానసిక శరీరంతో బాటు పనిచేస్తూనే ఉంటాయి. భౌతిక దేహం లేకుండా కేవలం సూక్ష్మ శరీంతో లేదా మానసిక శరీరంతో జీవాత్మ ఉండే పరిస్థితి కూడా ఉంది. సృష్టి ఆరంభమైన తర్వాత పరమాత్మ నుండి వేరుగా ప్రత్యగాత్మలుగా అయినట్లుగా అనుభూతి పొందే ఆత్మలు పరిణామక్రమంలో భౌతిక ప్రపంచంలో రాయి నుండి మానవ జన్మవరకు జరిగే రూప పరిణామానికి లోనుగాక మానసిక ప్రపంచంలో లేదా సూక్ష్మ ప్రపంచంలో ఆగిపోయి ఉంటాయి. కొన్ని లక్షల సంవత్సరాల వరకు అలాగే ఉంటాయి. వాటికి భౌతిక సంస్కారాలుండవు. సృష్టికి మూలమైన "లహర్" నేనెవరిని! అనే ప్రశ్నకు సంబంధించిన సూక్ష్మ లేదా మానసిక సంస్కారం మాత్రమే ఉంటుంది. అందుకని ద్వంద్వానుభవాలకోసం అనేక జనన మరణాలు పొందే అవసరం కూడా వారి కుండదు. బాల్యము, యవ్వనము, వృద్ధాప్యము అనే భౌతిక దేహానికుండే స్థితులు కూడా వారికుండవు. వారిని దేవీ, దేవతలు, దేవదూతలు అని అంటారు. మన పురాణాల్లో చెప్పబడిన ముక్కోటి దేవతలు వారే. భగవదైక్యం పొందడానికి వారు కూడా మానవ జన్మ ఎత్తవలసిందే కాని ఒకే జన్మలో వారికి భగవదైక్యం కలిగి తిరిగి పరమాత్మలో లీనమై పోతారు.

అలాంటి జీవాత్మకు ఉండే మూడు శరీరాల్లోని ఒక శరీరమ మానసిక శరీరం. దానినే సాధారణంగా మనస్సు అంటారు. మనస్సులో రెండు విభాగాలుంటాయి. ఒకటి ఆలోచనలకు చెందినది. ఇంకొకటి అనుభూతులకు సంబంధించినది. ఆలోచనలు చేసే విభాగాన్ని మనస్సు అంటారు. అనుభూతులకు చెందిన విభాగాన్ని హృదయం అంటారు. మానసిక శరీరం సృష్టి ఆరంభంతోనే ఉద్భవించినా పరిణామక్రమంలో రాయి నుండి జంతువుల దాకా అనేక రూపాల ద్వారా వికాసం చెంది మానవరూపం రాగానే సంపూర్ణంగా వృద్ధి పొందుతుంది. ఆత్మ చైతన్యం కూడా మానవ రూపంతోనే సంపూర్ణ వికాసం చెందుతుంది. మానవరూపం వచ్చేవరకు మనస్సు అనుభవాల వల్ల సంప్రాప్తించే ముద్రలు అనగా సంస్కారాలను ప్రోగుచేసుకుంటుంది. దీనిని చుట్టుకొనే ప్రక్రియ అనగా ఒక దారాన్ని రీలుకు చుట్టడంలాంటి ప్రక్రియగా పేర్కొనబడింది. ఈ ప్రక్రియలో సంస్కారాలు ఒకదానిపైన ఇంకొకటి దట్టంగా లోపలి రీలు కనబడకుండా చుట్టబడుతాయి. అలా సంప్రాప్తించే అనేకానేక సంస్కారాలను ప్రోగు చేసుకొని, భద్రపరచుకొని మళ్ళీ వ్యక్తం చేయడం కోసం మనస్సు వికాసం చెందుతుంది. ఇది ఆత్మ చైతన్య వికాసంతో బాటుగా ఏక కాలంలో జరుగుతుంది. క్రిమి కీటకాల స్థాయి వరకు అనగా రాయి. లోహము, వృక్షాల వరకు లేని ఒక మానసిక ప్రవృత్తి క్రిమికీటకాలనుండి ప్రారంభమౌతుంది. తనను తాను రక్షించుకోవాలనే విలక్షణమైన స్వభావం ప్రారంభమౌతుంది. ఈ స్వభావమే **'నేను'** , **'నాది'** అనే అహంకారానికి నాంది. ఈ





స్వభావాన్నే సహజ స్వభావము లేదా "ఇన్‌స్టింక్ట్" అని చెప్పారు. ఈ సహజ స్వభావము నెమ్మదిగా కాలక్రమేణా పరిణామ దశలలోని మిగతా రూపాల ద్వారా మానవ రూపం వచ్చే వరకూ పెంపొంది మానవ రూపంలో బుద్ధి "ఇంటలెక్ట్"గా పరిణతి చెందుతుంది. విభిన్న సంస్కారాల ప్రభావంతో పెంపొంది బలపడిన బుద్ధి అహంకారాల పొందుతో మనస్సు, సంపూర్ణంగా వికసించిన ఆత్మ చైతన్యాన్ని దేహభ్రాంతికి పరిమితం చేసి ప్రోగై ఉన్న అనేక సంస్కారాలను అనుభవించడానికి మానవ రూపంలో పునర్జన్మలకు హేతువైనది. "మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః అని ఉపనిషద్వాక్యం. మనస్సనగా సంస్కారాలతో నిండి ఉన్న మనస్సు. సంస్కారాలు మనస్సు యొక్క అంతర్భాగంలో నిక్షిప్తమై బీజ రూపంలో ఉంటాయి. తొలకరి వర్షాలతో భూమిపైన గడ్డి, రకరకాలైన మొక్కలు లోపల నిక్షిప్తమైన విత్తనాల వల్ల ఎలా పుట్టుకొస్తాయో అలాగే భౌతిక ప్రపంచపు సానుకూల వాతావరణంలో మనస్సులో నిక్షిప్తమై ఉన్న సంస్కారాలు కోరికల రూపంగా వ్యక్తమై అనుభవాలకు హేతువు లౌతాయి. చేకూరిన అనుభవాల ద్వారా క్రొత్త సంస్కారాలను కలుగజేస్తాయి. మనస్సులోని సంస్కారాలన్నీ మటు మాయమైతే మనస్సు హరించుకొనిపోతుంది, చైతన్యం పరిశుద్ధమౌతుంది. ఆత్మకు మోక్షం ప్రాప్తించి స్వస్వరూపానుభవం సిద్ధిస్తుంది. మేఘంలో నీటి యావిరి ఉన్నంత వరకే మేఘం యొక్క ఉనికి. అది నల్లగా కారుమబ్బుగా కనిపిస్తుంది. వర్షించడం ద్వారా నీటి యావిరి వదిలి వేయగానే మేఘం యొక్క ఉనికి లేకుండా పోతుంది. అదే దారపు రీలు నుండి చుట్టిన దారాన్ని విప్పడమనే ప్రక్రియ. ఈ ప్రక్రియ ఆంతరిక ప్రయాణంలో జరుగుతుంది. దానినే అవతార్ మెహెర్‌బాబా "మనోనాశ్"గా వివరించారు. నవజీవనపు ఆఖరి ఘట్టంగా హైదరాబాదు ఖోజాగూడ కొండపైన మనోనాశ్ అనే గుహలో ఏకాంతవాసంతో ప్రారంభించి మెహెరాజాద్ వద్ద గల తెంబికొండపైన చేసిన ఏకాంతవాసంతో మనోనాశ్ కార్యక్రమాన్ని అవతార్ మెహెర్‌బాబా విశ్వమానవాళి కోసం నిర్వహించారు. ప్రపంచంలోని అన్ని మతాలకు చెందిన క్రతువులు, కర్మలు, అనుష్ఠానాలను ధుని మంటలకాహుతి చేసి "మనోనాశ్" మరియు నవజీవనం కార్యక్రమాన్ని పూర్తి చేసారు. మనోనాశ్ గురించి బాబా యిలా చెప్పారు.

"భ్రాంతి మయమైన, పరిమితమైన, దుఃఖ భాజనమైన అజ్ఞానమైన, నశించునదైన అహం (నేను) పూర్తిగా తొలిగి దాని స్థానంలో అనంత జ్ఞాన, శక్తి, ఆనందములు, ప్రేమ శాంతి వైభవములను శాశ్వతంగా కలిగి ఉండి మార్పులేని అస్తిత్వంలో ఉండే సత్యమైన అహం (నేను) ప్రతిష్ఠంపబడడమే 'మనోనాశ్' యొక్క ముఖ్యోద్దేశము. మనోనాశము వైభవోపేతమైన స్థితిని ప్రసాదిస్తుంది. ఆస్థితిలో భిన్నత్వం నశించి ఏకత్వం వస్తుంది. అజ్ఞానం పోయి జ్ఞానం సంప్రాప్తిస్తుంది మరియు బంధనాలు తొలిగి స్వేచ్ఛ సిద్ధిస్తుంది.

నవజీవనం గురించి చమత్కారంగా బాబా యిలా చెప్పారు. "నవజీవనం నాకు

వనవాసం, నా అనుచరులకు సన్యాసం, సంబంధికుతుందరికీ సత్యనాశం".

సృష్టి ఆరంభంతోనే అత్యంత పరిమిత స్థాయిలో మనస్సు ఆవిర్భవించింది. పరిణామ క్రమంలో అనేక సంస్కారాలను ప్రోగు చేసుకొని పెంపొందుతూ చైతన్యాన్ని కూడ వికసింపజేస్తూ మానవ రూపం రాగానే పూర్తిగా వికసించింది. పరిణామక్రమంలో సంస్కారాల భద్రతకు అవసరమైన మనసు, దానిలో ప్రోగై ఉన్న సంస్కారాలవల్ల, మానవ రూపం రాగానే తన నిజ స్వరూపాన్ని తెలుసుకొనే బదులు తాను భౌతిక దేహాన్ననే భ్రాంతిని కలుగజేస్తుంది. మానవ రూపంలో 84 లక్షల జన్మలను పునర్జన్మ క్రమంలో మనస్సులో ప్రోగై ఉన్న సంస్కారాలు కలుగజేస్తాయి. మానసిక శరీరపు స్థితి నుండి గమనిస్తే అది అనగా మనస్సు ఒకేసారి ఆవిర్భవిస్తుంది, ఒకేసారి మరణిస్తుంది. పరిణామక్రమంలో ప్రతి దశలోని అన్ని రూపాలను ఒక్కొక్కటిగా ధరించి అనుభవాలను పొందుతుంది. మానవ రూపం వచ్చేవరకు 84 లక్షల అనుభవాల సంస్కారాలను ప్రోగు జేసుకుంటుంది. వాటిని పూర్తిగా లేకుండా చేసుకోవడానికే 84 లక్షల మానవ దేహాలను ధరించవలసి వస్తుంది. మానవ దేహాలను ధరించడం మరియు వదిలి వేయడమనే జనన మరణాల క్రమాన్ని లెక్కిస్తే అది పునర్జన్మ క్రమంగా చెప్పబడింది. అలాగాకుండా ఈ మానవ రూపాలను ధరించడానికి మూలమైన సంస్కారాలతో నిండి ఉన్న మనస్సు ఆవిర్భావాన్ని, అంతాన్ని లెక్కిస్తే మనస్సుకు ఒకే మరణము ఒకే జననము అందువల్ల ఆస్థితిని ఆధారంగా చేసుకొని పునర్జన్మలేదు అని చెప్పే ఇస్లాము మరియు ఇతర మతాల సూక్తి సరియైనదే. భౌతిక దేహాన్ని ధరించే ప్రక్రియను గీతలో కృష్ణ పరమాత్మ చిరిగిపోయిన వస్త్రాలను విసర్జించి క్రొత్త వస్త్రాలను ధరించడం అని చెప్పియున్నారు. అవతార్ మెహెర్‌బాబా అది జరిగిన తర్వాతనే మిధ్యాహంభావానికి మరణం మరియు నిజమైన మరణం కాదు మనోనాశ్ నేను భగవంతుడను అనే సత్యాహంభావానికి జననం సంభవిస్తాయని చెప్పారు. అలా నేను రాయిని, వృక్షాన్ని, కీటకాన్ని, చేపను, పక్షిని, జంతువును, మానవుడిని అనే మిధ్యాహంభావాన్ని కలిగించే మనస్సు ఒకేసారి పుడుతుంది. ఆ మనస్సు నశించగా అనగా మరణించగానే మిధ్యాహంభావము సత్యాహంభావంగా మారుతుంది.

రాయిస్థితినుండి మానవ రూపందాకా జరిగిన పరిణామ క్రమం, మానవ రూపంలో పూర్తిగా వృద్ధి చెందిన మనస్సు, 84 లక్షల అనుభవాలకోసం కావలసిన భౌతిక దేహాలను ధరించడమనే పునర్జన్మ క్రమం, సూక్ష్మ మానసిక అనుభవాలతో భగవదైక్యం పొందే వరకు చేసే ఆంతరిక ప్రయాణం ఊహజనితాలే, స్వప్న ప్రాయమే అని బాబా చెప్పారు. మనస్సు ఈ ఊహకు ఆలోచనలకు ఆలంబనం. అహంకారం ఆధారం. మానవ జన్మ రాగానే ఆత్మ చైతన్యం మనస్సు సంపూర్ణంగా వికసించినందువల్ల రూప పరిణామం





సంపూర్ణమౌతుంది. ఇక అంతకంటే మించిన రూపంలేదు. కాని తన నిజ స్వరూపాన్ని అనుభవించే బదులు ఆత్మకు తాను భౌతిక దేహాన్ని అనే భ్రాంతి కలుగడం వల్ల ప్రయాణం పెరిగి భౌతిక పునర్జన్మలు అవసరమయ్యాయి. మానవరూపం వరకు జంతుజాలంలో ఒక్కొక్క రూపంతో ఒకే సారి అనుభవంపొంది దాని ద్వారా కలిగిన చైతన్య వికాసంతో ఆత్మ మరొక ఉన్నతమైన రూపాన్ని ధరిస్తుంది. అదే రూపం మళ్ళీమళ్ళీ అవసరం ఉండదు. కుక్కగా ఒకసారి, పులిగా ఒకసారి, సింహంగా ఒకసారి, కోతిగా ఒకసారి మాత్రమే రూపంధరిస్తుంది. కుక్కకు తనను కొట్టిన వారిపై క్షణికమైన కోపం వస్తుంది. ఆ కోపం ఆతర్వాత ఉండదు. ఎందుకంటే దాని మనస్సు, బుద్ధి, అహంకారం పూర్తిగా వికసించలేదు. అందువల్ల ఆ భావం కొనసాగదు కాని మానవ రూపంలో అవి పూర్తిగా వికసించి వృద్ధి పొందినందువల్ల ఆ భావం జీవితాంతం భద్రపరచబడి ఉంటుంది. జన్మ జన్మలదాకా కొనసాగుతుంది. సంస్కారాలను ప్రోగుచేసుకొని భద్ర పరచడానికి అవసరమైన మనస్సే మానవ రూపం రాగానే స్వస్వరూపాన్ని తెలుసుకోకుండా పునర్జన్మ క్రమంలో ఆత్మ 84 లక్షల జన్మలనెత్తడానికి కారణమౌతుంది. బంధనాలను తొలగించి సంస్కారాలను లేకుండా చేసుకొని ఆత్మకు మోక్షాన్ని కలిగించడానికి అవసరమౌతుంది. "మనో నాశనం" తర్వాత మనస్సు హరించుకొని పోతుంది. హృదయం, పరిశుద్ధమైన హృదయం ఉంటుంది. ఆ హృదయంతోనే అత్మానుభూతిని నిరంతరాయంగా అనుభవిస్తుంది.

మనస్సు మామూలుగా పని చేస్తే మానవుడు,

మనస్సు వడి వడిగా పనిచేస్తే పిచ్చివాడు. మనస్సు నెమ్మదిగా పని చేస్తే మస్తు.

మనస్సు ఆగిపోతే భగవంతుడు అని బాబా చెప్పారు. మానసిక స్థితులను బట్టి భగవంతుని చైతన్య స్థితులు మారుతుంటాయి. మనస్సు తక్కువగా పని చేయడం మస్తుల స్థితి అనగా ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించిన సాధకులు హృదయంలో దివ్యానుభూతులు పొందుతూ తన్మయత్వంతో ఉన్నప్పుడు కలిగే మానసిక మాంద్యము అనగా తగ్గి పోయిన ఆలోచనలవల్ల ప్రశాంతంగా మారుతున్న మానసిక స్థితి. అందుకే వారిని పిచ్చివారనుకోవడం కూడా తరచుగా జరుగుతుంది. మనసులోని ఆలోచనలు తగ్గుతుంటే హృదయం ఆనందానుభూతిని పొందుతుంది. పతంజలి యోగశాస్త్రంలో చిత్తవృత్తి నిరోధకం అని యోగ లక్షణాన్ని వివరించారు.

బాబా తన మండలి వారితో నవజీవనంలో ఉన్నరోజుల్లో, మండలి వారిని భిక్షాటనకు పంపేవారు. వారు కేవలం ఆహారాన్ని మాత్రమే పుచ్చుకోవాలి డబ్బు పుచ్చుకోగూడదు. అలా వారు భిక్షాటనకు వెళ్ళినప్పుడు ముఖ్యంగా పట్టణాలలో బాగా చదువుకున్నవారు వారిని చూచి "ఇంత ధృఢంగా ఉన్నారు. ఏదైనా పని చేసుకొని బ్రతకక ఇలా భిక్షాటనం

చేయడం సిగ్గుగా లేదా!" ధూషించేవారు కాని పల్లెటూళ్ళలో మాత్రం ఏమీ చదువుకోని వారుకూడా వారిని కూర్చో బెట్టి వేడి వేడి ఆహారాన్ని భిక్షగా యిచ్చే వారు. ఒకసారి ఒక ఊళ్ళో ఏరుచ్ భిక్షాటనానికి వెళ్ళారు. ఒక ఇంటి ముందు నిలబడి ప్రేమ్‌సే భిక్షాదీజియే" అని అరిచాడు. ఏమీలేదు వెళ్ళి పొండి అని చెప్పాలని ఆ యింటిలో ఉండే స్త్రీ బయటకు వచ్చింది. కానీ ఏరుచ్‌ను చూచి చెప్పలేక పోయింది. తన ఇంట్లో ఏమీ లేకున్నా ప్రక్క యింటినుండి పిండి అడిగి తెచ్చి రొట్టెలు, కూరచేసి, వేడి వేడి రొట్టెలు, కూర భిక్షగా ఏరుచ్ జోలిలో వేసింది. అది అవతారునికి అతని మండలి వారికి ఆకలి తీర్చే అతి రుచికరమైన ఆహారమయ్యింది. కేవలం హృదయం పనిచేసే వారి స్థితి అలా ఉంటుంది.

మీకు సిగ్గు లేదా అని దూషించిన వారి స్థితి హృదయం మరుగున ఉండి కేవలం మనస్సు పని చేసే స్థితి. కేవలం హృదయం మాత్రమే పనిచేసే స్థితికి ఉదాహరణ మస్తుల స్థితి. వారికి భౌతిక ప్రపంచపు ఎరుక కూడా లోపిస్తుంది. బాబా ఆంధ్ర నా మస్తిష్కం (మనస్సు) హమీర్‌పూర్ నా హృదయం అని చెప్పారు. అనగా ఆంధ్రలో మనస్సు, బుద్ధి ఎక్కువ పాళ్ళలో పని చేస్తాయి. హృదయస్పందన, అనుభూతి తక్కువగా ఉంటాయి హమీర్‌పూర్‌లో హృదయానుభూతి ఎక్కువగా ఉంటుంది. మనస్సు, బుద్ధి తక్కువగా పని చేస్తాయని అర్థం. బాబా చెప్పినట్లు ఈ విశ్వంలోని 18000 ప్రపంచాలలో ఈ రెండు స్థితులు విభిన్న స్థాయిల్లో చాలా తారతమ్యాలతో పని చేసే స్థితులున్నాయి. మనస్సు, హృదయం సమపాళ్ళలో పని చేస్తేనే సమతుల్యస్థితి సంప్రాప్తిస్తుంది. ఆనంద దాయకంగా ఆరెండింటి సమతుల్యాన్ని కలుగజేస్తాను అని బాబా చెప్పారు. అది మన ఈ భూమి పైననే సాధ్యమని చెప్పారు. బాబా కృపతో, ఆయన యిచ్చిన అభయానుసారం బాబా ప్రేమికులందరు మనస్సు, హృదయం సమపాళ్ళలో పనిచేసే సమతుల్య స్థితిని పొందెదరు గాక.

## నరసన్నపేట సెంటర్ ప్రారంభం

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో అవతారుని సెంటర్ భవనం ఏప్రిల్ 20న స్థానిక యం.యల్.ఎ. శ్రీ ధర్మాన క్రిష్ణదాస్ ప్రారంభించారు. అనంతరం శ్రీ పి.వి.రంగ ప్రసాదరావ్ ఆధ్వర్యంలో అవతారుని సహవాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు మాట్లాడుతూ మెహెర్‌బాబా సెంటర్‌కు తనకు చేతనైన సహకారం తప్పక అందిస్తానన్నారు. మెహెర్‌బాబా సందేశాలు నేటి సమాజానికి ఎంతో అవసరం అన్నారు. సెంటర్ కార్యదర్శి శ్రీ సూర్యారావు నివేదిక చదివారు. శ్రీ సి.వై.చింతామణి, శ్రీ ఎస్.వి. సత్యనారాయణ, శ్రీ బాపిరాజు, శ్రీ మెహెర్ వెంకట్ తదితరులు ప్రసంగించారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, అవతారుని తత్వాన్ని తన ప్రధాన ఉపన్యాసంలో వివరించారు.

**-సంచారి**





# ఫ్రీనీ నాలావాలా

**(మల్లాది కృష్ణానంద్)**



అవతార్ మెహెర్‌బాబాను తమ ఇలవేల్పుగా ఆరాధించే వారెందరో వున్నారు. 'ఫ్రీనీ నాలావాలా' అలాంటి ప్రప్రథమలలో ఒకామెగా చెప్పుకోవాలి. ఫ్రీనీ అని, ఫ్రీనీ ఆంటీ- అని ఆమెతో బాగా పరిచయమన్నవారు- సన్నిహితులు ఆమెను పిలుస్తుంటారు.

ఆమె భర్త పేరు కైకోబాద్ నారావాలా. నవసారీ- గుజరాతీయులు.

వీరి కుమారుడే నౌషర్వాన్ అన్‌జార్. అలా అనడంకంటే, అమెరికా నుండి ప్రచురిస్తున్న **"గ్లో-ఇంటర్నేషనల్"** ఆంగ్ల పత్రిక సంపాదకుడు ఫ్రీనీ గారి కుమారుడు- నౌషర్వాన్ అనడం కూడా సబబు. గ్లో-పత్రిక 1964 నుండి ప్రచురిస్తున్నారు.

మేం ఇటీవల బెంగూళూరుకు ఆఫీసు పని మీద వెళ్ళాం. ఆ పనేదో అయినాక, చాలా కాలం నుండి 'ఫ్రీని నాలావాలా' గార్ని సంప్రదించాలన్న విషయాన్ని మా మనస్సులోని మాటను బాగా ఎరిగిన మిత్రులు రాజగోపాల్, బెంగళూరు, ఫ్రీని గారితో మాట్లాడి - ఆ ఏర్పాట్లు చేశారు.

రాజగోపాల్‌గారు మేం బెంగళూరులో దిగిన రోజుననే మెహెరాబాద్, పూనేలకు- ఖైరమంగళ విషయమై వెళ్తున్నారు.

కాగా వారి అల్లుడు- కుమార్తె మమ్మల్ని ఫ్రీని నాలావాలా గారింటికి తీసుకెళ్ళారు. ఎ. అప్పారావు, (డి.ఆర్.డి.ఎల్., హైదరాబాద్) వారింట్లో మాతో కల్సారు. అలా కాసేపు ఫిబ్రవరి నెలలో, బెంగళూరులో ఫ్రీనీ నాలావాలా అవతారుని సమక్షంలో గడిపిన మధురక్షణాలు కొన్నింటిని మెహెర్‌బాబా పాఠకులకోసం ప్రత్యేకంగా సేకరించడమైంది. ఆ వివరాలు మీముందుంచుతున్నాం. ఇకపై ఫ్రీనీ గారి మాటల్లోనే

మీరూ ఆలకించండి!! వీలు చిక్కితే స్పందించండి!! !!!

మెహెర్‌బాబాకి దగ్గరి బంధువు 'పిలమాసి'. - ఆమె కుమార్తె- నేనూ ఒకే స్కూల్లో చదువుకునే వాళ్ళం. అప్పట్లో మేం కరాచీలో వుండేవాళ్ళం. ప్రస్తుతం కరాచీ నగరం పాకిస్థాన్‌లో వుంది. ఆ అమ్మాయి పేరు- షిరీన్ ఇరానీ. షిరీన్- ఆ రోజుల్లోనే - వీలు చిక్కినప్పుడల్లా- మెహెర్‌బాబా గురించి మాకు చెప్తుండేది. పార్శీయుల ఆరాధ్యదైవం జురాతుస్ట్రనే మెహెర్‌బాబాగా అవతారమెత్తారని- షిరీన్ చెప్పుకొచ్చేది. మెహెర్‌బాబా చిత్రంతో వున్న ఉంగరం కూడా షిరీన్ నాకిచ్చింది. ఆ ఉంగరం నా చేతి వేలికి చాలా కాలం ఉంచుకున్నాను. ఆ అమ్మాయితో కల్సి- బాబా పాటలు కూడా- తెలిసీ- తెలియకుండా పాడుతుండేదాన్ని. మెహెర్‌బాబా పాటలు పాడటం, మెహెర్‌బాబాని జొరాతుష్ట్ర అనడం- ఇవన్నీ మా అమ్మకు సుతారామం నచ్చేది కాదు. పార్శీయులు జొరాతుష్ట్ర తిరిగి జన్మించాడన్నా- నమ్మే పరిస్థితి వుండదు. ఒక మాదిరిగా చెప్పాలంటే- మా వాళ్ళు- ఛాందసులనొచ్చు. అన్య దేవతారాధనను అసలుకే ఒప్పుకోరు. నేను మెహెర్‌బాబా పాటలు పాడుకుంటుంటే- అమ్మ అభ్యంతరం చెప్పేది.

ఇవేం నాకు పట్టనట్లు ఉంటుండగా నాకు 19 సంవత్సరాల వయస్సులో కైకోబాద్ నాలావాలాతో- నా వివాహం నిశ్చయమయింది. వారిది గుజరాత్ రాష్ట్రంలోని నవసారీ గ్రామం. వృత్తిరీత్యా డెహ్రాడూన్‌లోని సింగర్ కుట్టుమిషన్ కంపెనీలో పని చేస్తున్నారు.

ఇక్కడే ఒక్క విషయం చెప్పాలి. మా ఇంట్లో మెహెర్‌బాబాని నమ్మరు- వ్యతిరేకత కూడా అధికమే. - ఇదిలా వుంటే కైకోబాద్ నాలావాలా - మెహెర్‌బాబాని తమ ఇంటి దైవంగా ఆరాధిస్తున్నారు. అప్పటికే ఆయన బాబాపై కవితలు- కథనాలు రాస్తుండేవారు. అలా తిరిగి నేను మెహెర్‌బాబా గురించి కైకోబాద్‌గారి ద్వారా బాగా తెలుసుకోవడం జరిగింది. మా పెళ్ళాయ్యాక (1941), డెహ్రాడూన్‌కు చేరుకున్నాం. 1941 నుండి 1984 దాకా డెహ్రాడూన్‌లోనే 105, రాజ్‌పుత్ రోడ్‌లో వుండేవాళ్ళం.

బాబా కార్యక్రమాల్లో మా భర్త ఉత్సాహంగా పాల్గొనేవారు.

ఏరుచ్‌గారి తండ్రి, పాపా జెస్సావాలా, దాదా ఛాంజీ, కాకా బారియా ఇలా మొదటితరం బాబా మండలి సభ్యులు- మా ఆయనతో గల పరిచయాల వల్ల- తరచు బాబా పనిపై మా యింటికి వస్తుండేవారు. డెహ్రాడూన్‌లో ఏమైనా పనులు మెహెర్‌బాబా వారికి అప్పజెప్పితే వాటిని చేయడానికి కూడా- స్థానికంగా ఉండేవారం కాబట్టి- నేరుగా మా ఇంటికి వచ్చి, మా ఆయన సహాయం, సలహాలు వారు తీసుకునే వారు. అలా వచ్చిన వాళ్ళు- బాబాకు సంబందించిన సమాచారం, సాహిత్య ప్రతులు మాకు ఇచ్చేవారు. అలా- అలా నేను కూడా - నాకు తెలియకుండానే అవతారుని సేవలో నిమగ్నమయ్యాను. అయితే, నేను కూడా ఒక పార్శీ వనితగా- జొరాతుష్ట్రని తప్పించి





మరొకర్ని నమ్మలేని- ఊహించుకోలేని పరిస్థితి వుండేది. ఇలా వుండగా ఒక రోజున మెహెర్‌బాబా- తన మండలి వారితో కల్సి మా ఇంటికి వచ్చారు. తొలిసారిగా ఆ దివ్యావతారుని దివ్యమంగళ స్వరూపం దర్శించుకున్నాక నాలో చాలా మార్పు వచ్చింది. ఆనాటి నుంచీ - అవతారుడ్ని మా ఇంటి ఇలవేల్పుగా ఆరాదిస్తున్నాను. ఆ తర్వాత మెహెర్‌బాబా డెహ్రాడూన్‌కి వచ్చినప్పుడల్లా మా ఇంటికి తప్పక వచ్చేవారు.

1947లోనో, 1948లోనో బాగా గుర్తులేదు. కానీ, మార్చి 21న పార్శీయుల ముఖ్యమైన పండుగ- **నౌరోజు** జరుపుకుంటున్నాం. అప్పట్లో బాబా 'డూన్'లోనే వున్నారు. బాబా మమ్మల్ని 'లంచ్'కి ఆహ్వానించారు. మంచి రుచికరమైన వంటకాలు వడ్డించారు. 'మెహెరా' స్వయంగా వడ్డించింది. ఆ తర్వాత బాబా పోస్టుకార్డు సైజు ఫోటోలు మాకు బహుకరించారు. బాబా దగ్గర 'ఎల్చా మేస్త్రీ' అనే మంచి హాస్యకారుడు ఉండేవారు. బాబాకు హాస్యం అంటే ఎంతో ఇష్టం కదా!! బాబా దగ్గర విదూషకుడనే వారాయన్ని. ఎల్చా మేస్త్రీ మాకు దగ్గర బంధువవుతారు. ఒక సందర్భంలో మెహెర్‌బాబా మండలి సభ్యులు, మరో ఐదుగురు మా యింటికి భోజనానికి వచ్చారు. ఏవో కొన్ని రకాల బ్యాస్కెట్లు, సబ్బులు, పౌడర్లు జ్ఞాపికలుగా స్త్రీ మండలిచేత నాకు బాబా ఇప్పించారు. అవి ఇప్పటికీ నేను పదిలంగా భద్రపరుచుకున్నాను. బాబా మా యింటికి వచ్చినప్పుడు మా యిద్దరు పిల్లల్ని తన ఒడిలోకి తీసుకుని ఎంతోసేపు ఆటలాడారు. అప్పటికి మాకు ఒక పాప, ఒక బాబు (5 సం॥) నౌషర్‌వాన్ వున్నారు. మా ఐదేళ్ళ బాబు బాబా కోసం ఒక చిన్న ప్రేమ కవిత రాసి - బాబాకు బహుకరించాడు. బాబా ఎంతో సంతోషించారు. నౌషర్‌వాన్‌కు చిన్నతనంలో 'స్కాబీస్' వ్యాధితో బాధపడ్డాడు.

అప్పుడు వానికి ఐదారేళ్ళ వయస్సుంటుంది. చర్మంపై ఎక్కడ గోకితే అక్కడల్లా రక్తపు మరకలు పడేవి. మందులెన్ని వాడినా రోగం నయం కాలేదు. ఇది బాబాకు తెలిసి ఒక సలహా ఇచ్చారు. డా॥ గోహెర్ కూడా బాబాతోనే వున్నారు. లైఫ్‌బాయ్ సబ్బుతో పిల్లవాని ఒళ్ళంతా వేడ్నీళ్ళతో శుభ్రం చేయమన్నారు. ఆ తర్వాత ఒళ్ళంతా ఒక స్క్రబ్బర్‌తో బ్రష్ చేయమన్నారు. ఆ పిదప అస్కేబియాన్ అనే ఆయింట్‌మెంట్ పూత రాయమన్నారు. అలా చేశాక, ఒక శుభ్రమైన ఉతికిన టవల్‌తో పిల్లవాడ్ని వుంచి పడుకోబెట్టమన్నారు. నేను అలాగే చేశాను. అయితే అలా చేశాక- పడుకున్న పిల్లవాడు ప్రాణం పోయిందా? అన్నట్లు ఆ మర్నాటి దాకా నిద్రలేవ లేదు. ఏమయ్యిందా అని భయపడ్డాను. కానీ తిరిగి ఆ చర్మవ్యాధి జాడ కన్పడలేదు.

నేనేం పాపం ఎరుగను. ఎందుకిలాంటి చర్మవ్యాధి సోకిందని నౌషర్వాన్ దీనంగా బాధపడ్తుండేవాడు. ఇదో మహత్యంలా ఆ వ్యాధి మటుమాయమయింది. పిల్లవాని ఒళ్ళు తుడిచిన తువ్వాలా, యితరత్రా అన్నీ తగులబబెట్టేయమన్నారు. నేను అదేమాదిరిగా చేశాను. తిరిగి ఆ వ్యాధి కనపడలేదు సుమీ!!

**చక్రాట**



మరోసారి ఏమయిందంటే, మా బంధువులు కొంతమందితో కల్సి 'చక్రాట' అనే గ్రామానికి వెళ్ళాం. తిరుగు ప్రయాణంలో మేం ప్రయాణిస్తున్న బస్సు అదుపు తప్పింది. గొప్ప లోతైన లోయలో పడ బోయింది. బస్సు ముందు చక్రాలు 'లోయ ముందు భాగాన వ్రేలాడుతున్నాయి. బస్సు డ్రైవర్ కూడా హెల్ప్-హెల్ప్- అని అరుస్తున్నాడు. ప్రాణాలు పోయాయనిపించింది. మేం మెహెర్‌బాబాని 'అన్యధా శరణం నాస్తి' అని ఆయన నామం జపించడం మినహా మరొకటి బోధపడలేదు. ఆశ్చర్యంగా ఏమైందో తెలుసాండి! ఎదురుగా ఒక పెద్ద కారులో, ఎర్రని షర్వానీ- కుర్తాలో ఒక స్త్రీ మూర్తి వచ్చింది. మా బస్సు ప్రమాదపు అంచున ఉండటం గమనించి, స్టీరింగ్ తన చేతిలోకి తీసుకుని, కొన్ని క్షణాల్లోనే బస్సును రోడ్డుపై నిల్పింది. మాకెంతో ఆశ్చర్యం వేశింది. మేం సంభ్రమాశ్చర్యాల్లోంచి బయట పడేలోపే ఆమె తన కారు ఎక్కి ఎంచక్కా వెళ్ళిపోయింది.

ఇదంతా అవతారుని లీలగా భావించాం. ఆ విషయాన్నే బాబాకు మా భర్త ఒక లేఖలో తెలిపారు. ఐతే బాబా మాత్రం నేనేమీ మహత్యాలు చేయను. అదంతా మీకు నాపై గల నమ్మకం- విశ్వాసం మాత్రమే అని చిరునవ్వుతూ కొట్టి పడేశారు. మీకు నాపై గల నమ్మకం, విశ్వాసం వల్లనే మీరా ప్రమాదం నుంచి బైటపడ్డారని అన్నారు. నా మహత్యం అని ఎన్నడూ అనొద్దు. మహత్యాలు నేను చేయనని- బాబా స్పష్టం చేశారు.

బాబా మండలి సభ్యులు డా॥ విలియం డాంకిన్ తన డిస్పెన్సరీని డెహ్రాడూన్‌లో ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇదీ అవతారుని ఆదేశమే. ఐతే అందుకు తగిన - వసతి - సౌకర్యం చూపే బాధ్యత మా ఆయనకు అప్పగించారు. నా భర్త 'డూన్‌లో' ఒక అనువైన బిల్డింగ్‌ను, 29 లిట్టన్ రోడ్డులో చూశారు. బాబా ఆ భవనంలో డా॥ డాంకిన్ వైద్యశాలను ప్రారంభించారు.

డిస్పెన్సరీ ప్రారంభం సందర్భంగా, రవ్వ, పకోరా, టీ- ఏర్పాటు చేయమని బాబా నన్ను ఆదేశించారు. ఏడు శేర్లు పాలుతో టీ- ఇతర ప్రసాదం ఏర్పాటు చేశాను. బాబా ప్రసాదాన్ని ఒక్కొక్కరికీ ఇస్తున్నారు. నేను చేసింది సరిపోదేమోననే సందేహం, భయం కల్గింది. జనం బాగా వున్నారు. బాబా- బాగా చేతినిండా- కడుపారా పెట్టడం అలవాటు. ఇది బాబా ప్రేమికులు చాలా మందికి తెలుసు. నాకయితే వెన్నులోంచి





భయం పుడ్తోంది!! అయితే, అందరికీ పంచినాక కూడా - డెహిషాలలో యింకా చాలా మిగిలింది!! ఇదిచూసి ఆశ్చర్యం - ఆనందం నావంతైంది.!!

మెహెర్‌బాబా నవజీవనంలో వున్నప్పుడు డూన్‌లో ఉన్న రోజుల్లో- ఒకరోజున **'ప్రేమ్‌సే భిక్షాదీజియే'** అని మా ఇంటి తలుపు తట్టారు. బాబా కోసం ప్రేమతో వండిన పదార్థాలు భిక్షగా ఇచ్చాను.

డూన్‌లో వుండగానే- 1984 ప్రాంతంలో నా భర్త కాలికి ఫ్రాక్చర్ అయింది. అప్పట్లో నా కుమార్తె- అల్లుడు- బెంగళూరులో వుంటున్నారు. మంచి వైద్య సౌకర్యం బెంగళూరులో లభిస్తుందని చెప్పి వారి కోర్కె మేరకు డూన్‌లో ఇల్లు ఖాళీ చేసి, బెంగళూరుకు 1984లో వచ్చాం. ఆ దరిమలా, 1994లో భర్త చనిపోయారు. మా నౌషెర్వాన్, మెహెర్ నజర్ పేరిట, 4 పార్క్‌లాండ్ అపార్ట్‌మెంట్‌లో ఒక సింగిల్ బెడ్‌రూం నొకదాన్ని, ఈగిల్ స్ట్రీట్, లాంగ్ ఫోర్డ్ టౌన్‌లో మా కోసం కొనుగోలు చేశాడు.

అలా అలా వచ్చి- యిక్కడ బెంగళూరులో స్థిరపడ్డాం.

మా అబ్బాయి నౌషెర్వాన్ "ఎయిర్ ఇండియాలో, భారత విమాన సంస్థలో పౌరసంబంధాల అధికారిగా పన్జేస్తుండేవాడు. నౌషర్వాన్ కొడుకుకు 4 సంవత్సరాల వయస్సులోనే ల్యుకేమియా- బ్లడ్‌క్యాన్సర్ సోకింది. బాబు చాలా బాధ పడ్డాడు. ముంబాయిలో ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఎంతో ఖర్చయ్యింది. తిరిగి బ్రతుకుతాడనుకోలేదు. బాబా ప్రేమికులు చాలా సహాయం చేశారు. ఆర్థికంగా ఆదుకున్నారు. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ - అవసరమయ్యేది. కీమోథెరపీకి అవసరమైన డబ్బులు ప్రేమతో సమకూర్చారు.ఆ ఆపద సమయంలో బాబా ప్రేమికుల - ప్రేమ, సహాయం మరువలేనిది. ఏమైతేనేం-ఇప్పుడు ఆ పిల్లవానికి 20 సంవత్సరాలు పైబడినాయి. పెళ్ళయింది. భార్య పిల్లలతో అమెరికాలోనే సంతోషంగా ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఇదంతా బాబా దయ, కరుణేనని మా నమ్మకం!!

## గ్లో పత్రిక

నౌషెర్వాన్ బి.ఏ. చదువుతుండే రోజుల్లోనే తానొక మాసపత్రిక నిర్వహించాలనే ఉద్దేశ్యం ఉందని- మెహెర్‌బాబాకు ఒక ఉత్తరం రాశాడు.

మాది సాధారణ మధ్య తరగతి కుటుంబం. అది బాగా తెలిసిన బాబా, పత్రిక నడపటం కష్టమంటూ, తల్లి తండ్రులకు భారం కాకూడదని సలహా ఇచ్చారు. అప్పట్లో వున్న 'దివ్యవాణి' పత్రికకు వ్యాసాలు రాయమని బాబా సలహా ఇచ్చారు.

నౌషర్వాన్ మంచి చక్కని భాషా చాతుర్యం గల ఉపన్యాసకుడు. గొప్ప రచయిత. దేన్నైనా అతను బాగా వర్ణిస్తూ రాయగలడు. 1950 ప్రాంతంలో World Religious Conference లో ఉద్దండులైన పండితులు- మత పెద్దల సరసన కూర్చొని, మెహెర్‌బాబా

గురించి అనర్గళంగా నౌషర్‌వాన్ ప్రసంగించాడు. బాబా నామవ్యాప్తి మెహెర్‌బాబా గురించి అనేక విషయాలు ఆసక్తికరంగా మాట్లాడగల దిట్ట నౌషర్‌వాన్.

ఐతే, పత్రిక నొకదాన్ని నిర్వహించాలన్న కోర్కెతోనే 1960వ దశకంలో తొలిసారిగా నాల్గుపేజీలు, రెండు రూపాయల వెలతో న్యూస్ బుల్లెటిన్ మాదిరి 'SPARK' "స్పార్క్" పేరుతో పత్రికను నెలకొల్పాడు. ఇదే పేరుతో మరో పత్రికను మరొకరు నడుపుతున్నారు గాన పత్రికను నిలిపివేయాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. అప్పుడు 'గ్లో' పేరుతో పాటు మరో నాలుగు పేర్లు సూచిస్తూ– తిరిగి ధరఖాస్తు పంపగా–గ్లో– పేరుకు అనుమతి లభించింది. గ్లో– పేరున పత్రిక ప్రచురించేందుకు మెహెర్‌బాబా అనుమతి కూడా నౌషర్‌వాన్ తీసుకుని తొలి ప్రతిక ముద్రించి అవతారునికి పంపారు. కాగా బాబా మండలి సభ్యులు ఏరుచ్ బాబాకు గ్లో సంచికను చూపించి ఆయన సందేశం, చేవ్రాలుతో తిరిగి నౌషర్‌వాన్‌కు పంపారు.

"నిజాయితీగా, సత్య నిష్ఠతో పత్రిక నిర్వహించమని" బాబా తన సందేశంలో ఆదేశించారు. ఆ మాదిరిగా గత 44 సంవత్సరాలుగా పత్రికను నిర్విఘ్నంగా ప్రచురిస్తున్నాం. ఇండియాలో పత్రికకు సర్క్యులేషన్ రెండు వేల కాపీలు దాకా వుంది. ప్రింటింగ్‌కు సుమారు రు. 700/– దాకా అవుతుంది. కాగా రు. 500/– వార్షిక చందా వసూలు చేస్తున్నాం. ప్రతి నాల్గునెలలకొకసారి విడుదలయ్యే ఈ పత్రిక వార్షిక మూల్యం రూ. 500/–. పత్రిక అడ్రస్సు కావాలంటే

Glow International, Meher Nazar, 4, Park Land Apartments, 13,13/1, Eagle Street, Langfold Town, Banglore - 560025,

గ్లో మాస పత్రిక పనులు, ఇంటి పనులు– బాబా నామంతో క్షణం తీరిక లేకుండా– శేష జీవితం గడుపుతున్నాను. బాబా ప్రతి క్షణం నాతో ఉన్నట్లే– మాట్లాడుతున్నట్లు ఉంటుంది. ఇంత ఇంటిలో ఒంటరిగా ఎలా వుంటున్నావని తరచు చాలామంది నన్ను అడుగుతారు. బాబా నాకు తోడుగా ఉన్నారు. నేను ఒంటరిగా క్షణకాలం లేనన్నది నా నమ్మకం!!

ఇలా ఫ్రీనీ నాలావాలా గారితో మా సంభాషణ సుమారు రెండు గంటల పైగా జరిగింది. ఆమె మస్తిష్కంనిండా అవతారునికి సంబంధించిన విషయాలే!!

అలా ఆమె చెబుతుంటే ఎన్ని రోజులైనా సరిపోవనిపించింది. తన జీవిత విశేషాలను భావితరాల కోసం గ్రంధస్తం చేస్తున్నానన్నారు. 1920 నవంబరు 14న కరాచీలో జన్మించిన ఫ్రీనీ ఆంటీ (88) ఒక గొప్ప మనసున్న మనీషి. మెట్రిక్ దాకా చదువుకున్న ఆమె చక్కని సరళమైన ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతుంటే అనేక విషయాలు నోట్ చేసుకున్నా వ్యాస విస్తీర్ణ భీతితో సక్షిప్తంగా ముగిస్తున్నాను. ఆమె చెప్పిన మాటల్లో రాయవల్సినవి ఇంకా చాలా వున్నాయి.





# మెహెర్‌బాబా శతకము

**– సామల రాజమల్లయ్య (సిరిసిల్ల)**

సీ॥ నీ ధ్యాన నిరతులై నినుగొల్చువారలు
నీ ప్రేమ పాత్రులు నీకు ప్రియులు
నీ పాద సేవకై నిలచిన వారలు
నీకు విధేయులు నీకు ప్రియులు
నీ నామ సుధగ్రోల నిను గోరువారలు
నీ నిజ భక్తులు నీకు ప్రియులు
నీ దర్శనేచ్ఛులై నిను జేరువారలు
నీకు సన్నిహితులు నీకు ప్రియులు
నీవు గాకుండ జగమున నిలుచు నెవడు?
నీవె సర్వమై యుండగ నిత్యుడెవడు?
మధురమంజుల మోహన! మౌనభాష!
స్నిగ్ధ ధరహాస! మెహెరుబా! చిద్విలాస!

సీ॥ నీ నామ మెవ్వడు నిరతము స్మరియించి
నీ పద ధూళియై నెగడుచుండు
నీ రూపమెవ్వడు నిల్పి ఫాలము నందు
నీ లీల తిలకించి నెగడుచుండు
నీ గాథ లెవ్వడు నిత్యము వినుచుండి
నీకు విధేయుడై నిలచి యుండు
నీ ప్రేమ నెవ్వడు నిస్వార్థ పరుడయి
పరుల కెల్లప్పుడు పంచుచుండు
వాడె, ప్రేమకుండగు నీకు వాస్తవముగ
వాడె, నినుగాంచు సర్వత్ర వసుధ పైన
మధురమంజుల మోహన! మౌనభాష!
స్నిగ్ధ ధరహాస! మెహెరుబా! చిద్విలాస!

–సశేషం

# సమీక్ష చెన్నైలో రెండ్రోజుల సహవాస్

**(సంచారి)**

చెన్నైలో మే 3,4 తేదీలో నిర్వహించిన రెండ్రోజుల సహవాస్ కార్యక్రమం కడురమ్యంగా విజయవంతంగా ముగిసింది.

తెలుగువారు పలు జిల్లాల నుంచి సుమారు 700 మందికి పైగా సహవాస్‌లో పాల్గొన్నారు. సహవాస్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా, ఆనందంగా కొనసాగింది.

ప్రముఖ వాగ్గేయకారుడు మల్లిక్, కాకినాడ వారి దగ్గరి బంధువు- బాబా ప్రేమికులు, చెన్నై నగర నివాసి- శ్రీని బాబు ఆధ్వర్యంలో జరిగిన చెన్నై సహవాస్ ఘనంగా ముగిసిందని హాజరయిన ప్రేమికుల హృదయాలు మెహెరుని ప్రేమతో నిండాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సహవాస్‌ను సంగీత- సాహిత్యాలను సమపాళ్ళలో అందించిన అరుదైన సహవాస్‌గా సభికులు అభివర్ణించడం గమనించాలి.

దక్షిణాది రాష్ట్రాలలోని నాలుగు భాషలలో అవతారుని గీతాలు ఆలాపించారు. తెలుగు, తమిళ, కన్నడ, మళయాళంలలో, పలువురు సంగీత కళాకారులు అవతారుని గీతాలు, నృత్యరూపకాల ప్రదర్శన ఆహుతులను అలరించాయి.

పాటలు పాడిన వారిలో కూడా విభిన్నత కొట్టేచ్చేలా చిన్నారి బాలబాలికల నుంచి, తలపండిన పెద్దలుదాకా అన్ని వయస్సుల వారు-స్త్రీ-పురుషులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం ఓ విశేషం. సుమారు 57 మంది గృహిణులు ఒకే రకం కలనేత చీరలతో- రాగతాళ యుక్తంగా చక్కని గళంతో అవతారుని కీర్తనలు ఆలాపించారు. తెలుగులో పాటలు ఎస్.పి. వసంత, మళయాళంలో సినీ ప్లే బాక్ సింగర్- సునంద- **“మెహెర్‌నామస్మరణం”** పాట, కన్నడంలో **‘షెరియార్జి తనయ’** - గీతాన్ని గోపాలపురం సిస్టర్స్‌గా పేరుగాంచిన కామాక్షీ-మీనాక్షిలు- అద్భుతంగా గానం చేశారు.

## వాయిద్య సమ్మేళనం

“అవతార్ మెహెర్‌బాబాకిజై” అని అవతారుని నామజపాన్ని పలు వాయిద్యాలపై సుమారు 30 నిముషాలకు పైగా ఏకధాటిగా అత్యంత మధురంగా ఆలాపించి, సభికులను తన్మయుల్నిచేశారు. సభికులు సయితం కేరింతలు కొడ్తూ, ఈ కార్యక్రమ ముగింపు సమయంలో **అవతార్ మెహెర్‌బాబాకి జై** అని జయజయ ధ్వానాలు గొంతెత్తి ఎంతో బిగ్గరగా చేశారు. ఐతే, కొన్ని వందల గొంతుకలు- ఏకకాలంలో తమ ఉచ్ఛస్వరాలను తెరిచేసరికి వెల్లువెత్తే ‘శబ్దపరిణామాన్ని’ మీరే ఊహించండి.








అలాగే తమిళంలో **‘వందనం- మెహెర్బాబా వందనం’** - కోరస్‌కు- సభికులు సయితం గొంతులు కలిపారు. కీబోర్డులపై చిన్న పిల్లల గానం - అద్భుతంగా కొనసాగింది.

అనంతరం Beyond words అనే అంశంపై అవతారుని చలనచిత్ర ప్రదర్మన ప్రదర్శించడమైంది.

## “మెహెదర్శన్” నాటిక

రాత్రి 10.30 నుండి మెహెర్‌దర్శన్ నాటిక హరిమెహెర్ బృందం విశాఖపట్నం వారి సౌజన్యంతో ఆరు అంకాలలో అవతారుడు చెన్నై నగర పర్యటనా విశేషాలు విశేషంగా, చక్కగా ప్రదర్శించారు. చిన్న పిల్లల నృత్య ప్రదర్శన, మహిళల కోలాట ప్రదర్శన, గోపీకృష్ణ, హైదరాబాద్ బృందం, డి.ఎస్.ప్రకాశ్‌రావు- శ్రీకాకుళం బృందం, సూర్యం, నరసన్నపేట బృందం, మల్లిక్ బృందం భజనలు- సంకీర్తనలు ఆలాపించారు.

## నగర సంకీర్తన

మే 4వ తేదీ ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకూ పెద్దఎత్తున నగర సంకీర్తన అవతారుని చిత్ర పటంతో పెద్ద ఎత్తున చేపట్టారు. నగర సంకీర్తనలో సుమారు 700 మంది పైగా పాల్గొన్నారు. రమారమిన ఒక కిలో మీటరు పొడవున, మూడు వరుసల్లో బాబా ప్రేమికులు కడు రమ్యంగా మెహెర్ నామం జపిస్తూ, గంటసేపు చెన్నై మహానగర వీధుల్లో ఒక మరుపురాని సంఘటనగా నిర్వహించారు. మల్లిక్ బృందం,

కాకినాడవారు, నగర సంకీర్తనలో అందరి కంటే ముందుండి లయబద్ధంగా బాబా నామం చేస్తూ కార్యక్రమాన్ని రసవత్తరంగా నడిపించారు.

రెండ్రోజుల సహవాస్‌లో సంగీత భరిత భజనలు- కీర్తనల ఆలాపనలతో పాటుగా ప్రముఖ ఉపన్యాసకులు డా॥ జి.యస్.యన్.మూర్తి గారి ప్రసంగం- ప్రధాన వక్తగా ఆయన ఎన్నో ఆసక్తికర విషయాలు చెప్పారు. సాక్షాత్తూ ఈ యుగావతారునిగా వచ్చిన మెహెర్‌బాబాను నమ్మి - ఆరాదించమని ఆయన అన్నారు మహాత్మాగాంధీజీతో పరిచయమున్న జి.యస్.యన్. ఒక సందర్భంలో గాంధీజీ దగ్గరకు వెళ్ళితే- ఆయన మౌనంగా వుండటం గమనించి ఆ విశేషం ఏమని ఆయన్నే అడిగితే, తాను మెహెర్‌బాబా స్పూర్తితో వారంలో ఒక రోజున మౌనంగా వుంటున్నానని అన్నారు. ఆ విధంగా తాను తొలిసారిగా మెహెర్‌బాబా మౌనం గురించి మహాత్మాగాంధీజీ ద్వారా తెలుసుకున్నానన్నారు. "మహాత్మాగాంధీతో తనకు ఆధ్యాత్మిక సంబంధం వుందనే వారు మెహెర్‌బాబా అని" డా॥ జి.యస్.యన్. గుర్తుచేశారు. మెహెర్‌బాబా మౌనావతారుడు ఆదిశక్తి అని అన్నారు. మౌనంగా వుంటూనే మెహెర్‌బాబా 6000 పైగా ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చారని ఆయనన్నారు.

నేను 1941లో మెహెర్‌బాబా గురించి తెలుసుకున్నాను. దాదాపు అదే సమయం నుండి అవతారుని సేవలకే అంకితమయ్యానని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మెహెరాబాద్‌లో స్థిరపడిన విదేశీయుడు పాశ్చాత్య ప్రేమికుడు- వార్డ్ పార్క్స్ మాట్లాడుతూ ఒక విశేష కథ ఇలా చెప్పారు.

"ఒక వ్యక్తి ఎత్తైన కొండ ఎక్కుతూ పట్టు తప్పిపోయాడు. క్రిందకు చూస్తే పెద్ద అగాధం- భయంకరంగా కన్పిస్తుంది. చేతికందిన సహాయాన్ని రెండుచేతుల్తో అందిపుచ్చుకుని వ్రేలాడుతున్నాడు. క్రిందివైపుకి చూస్తూ- "సహాయం కావాలి- హెల్ప్ ప్లీజ్"- అని ఆ ఆగంతకుడు కేకలు వేస్తాడు. నేను చాలా క్రింద వున్నాను. నేను చేయగల్గింది ఏం లేదని క్రిందున్నవారు తమ నిస్సహాయత వెల్లడించారు.

తిరిగి పైకి చూస్తూ గట్టిగా అరిస్తే- భగవంతుడు నేనున్నానని అభయమిస్తూ, - రెండుచేతులు జోడించి, మనసారా సహాయం కోర్తూ దేముడ్ని ప్రార్థించు, తప్పక తగిన సాయం అందుతుందని భరోసా ఇచ్చాడు.

కానీ- చిన్న బుద్ధి!!

ఆ వ్యక్తి రెండు చేతులతో దణ్ణం పెట్టడానికి భయపడతాడు.

చివరాఖరికి సహాయం అందక విలవిలలాడతాడు!!

అదేమాదిరిగా మన మధ్యకొచ్చి, ఎదురుగా వున్న అవతారుడ్ని ఆరాదించడంలో





మనమెంతో వెనుకంజలో వున్నామని వార్డ్‌పార్క్స్ చమత్కరించారు.

మెహెర్‌బాబా మనకు Assurance & Solace (అభయం- ఊరట) కల్గిస్తారు.

మన అవసరాల నిమిత్తం అవతారుడ్ని ఆరాధించడం మానుకోవాలి అని హితవు చెప్పారు.

Pray God for God అని, అవతారుడ్ని మీ మనోఫలకాలపై మీమీ హృదయాలలో పదిలంగా భద్రపరచుకోండని అన్నారు.

మెహెర్‌బాబా చెన్నైనగరాన్ని- ఆనాటి బాబా ప్రేమికులు శ్రీ సంపత్ అయ్యంగార్ కోర్కెపై తొలిసారిగా 1930 మార్చి 2న సందర్శించారు. ఆ దరిమలా మరో రెండు దఫాలు అంటే 1934 ఫిబ్రవరి, 1947 ఏప్రిల్ మాసాలలో తిరిగి చెన్నై సందర్శించారు.

మెహెర్‌బాబా ప్రారంభించిన తొలి బాబా సెంటర్ చెన్నైలోనే కావడం విశేషం.

ఇక్కడి సైదాపేట, బ్రాహ్మణవీధిలో గల సంపత్ అయ్యంగార్ గారి ఇంటికి ఎదురుగాగల ఖాళీ జాగాలో మెహెర్‌బాబా ఆనాడు రావి మొక్కనాటారు. ఆ మొక్క పెద్ద వృక్షంగా నేడు దర్శనమిస్తోంది. ఈ ప్రాంగణంలోనే నేడు అయ్యంగార్ గారి వారసులు "Temple of Silence" పేరిట 'మౌన దేవాలయం' నిర్వహిస్తున్నారు. సంపత్ అయ్యంగార్ గారి వంశీయులలో ఆరవ తరం నేడు నడుస్తోంది.

ప్రతిరోజు ఉదయం 7-9 గంటల మధ్య రెండు గంటలు, తిరిగి సాయంత్రం 4-6 గంటల మధ్య మరో రెండు గంటలు మాత్రం- మౌన దేవాలయం బాబా ప్రేమికులకు వీలుగా తెరచివుంటుంది.

చెన్నై సహవాస్ సందర్భంగా ప్రత్యేకంగా బాబా ప్రేమికులందరినీ మౌనదేవాలయ సందర్శన కార్యక్రమం నిర్వహించారు.

రెండ్రోజుల సహవాస్‌లో సంపత్ అయ్యంగార్ గారి మనుమడు-ముని మనుమళ్ళు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అయ్యంగార్ గారి మనుమడు కస్తూరి అయ్యంగార్ (83) సభికులకు ఆహ్వానం పలికారు.

చెన్నై సెంటర్ నిర్వాహకులలో ప్రముఖులు శ్రీ సీతారామయ్య వందన సమర్పణ చేశారు.

కార్యక్రమాన్ని ఎంతో పటిష్టంగా, రసవత్తరంగా, నిర్వహించిన నిర్వాహకులు శ్రీ శ్రీనిబాబు, శ్రీ బి.రామకృష్ణయ్య, వి.ఆర్.కె బాలాజీ, హైదరాబాద్‌లకు, పలువురు సభికులు అభినందనలు తెలిపారు.

# శ్రద్ధాంజలి

## కె.కె.రామక్రిష్ణన్ బాబాలో ఐక్యమయ్యారు.

ఏప్రిల్ ఉదయం 7 గంటలకు అవతార్ మెహెర్‌బాబా పూనే సెంటర్ వ్యవస్థాపకుల్లో ప్రముఖులైన కె.కె.రామక్రిష్ణన్ మెహెరునిలో ఐక్యమయ్యారు.

ఆయన వయస్సు 84 సంవత్సరాలు. గత కొంతకాలంగా అస్వస్థతతో వున్న కె.కె.రామక్రిష్ణన్ బాబా సేవలో విస్తృతంగా పనిచేశారు.

క్లుప్తంగా **కె.కె.**గా పలువురికి ఆయన పరిచయం. అతి చిన్న వయస్సులోనే కేరళ రాష్ట్రంలోని స్వగ్రామం వదలి భారతీయ ఆర్మీలో చేరారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మలేషియా, బర్మా ప్రాంతాలలో పనిచేశారు. అనంతరం పూనేలోని ఆయుధకర్మాగారానికి ఆయన్ని బదిలీ చేశారు.

లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వ్రాసిన 'గీతా రహస్యం'లో మొట్టమొదటిసారిగా మెహెర్‌బాబా గురించి కొన్ని మాటలు ఆయన చదివారు. చిన్నతనం నుంచీ ఆధ్యాత్మిక విషయాల పట్ల మక్కువగల కె.కె., ప్రముఖ తాత్వికవేత్త శ్రీ జిడ్డు క్రిష్ణమూర్తి, రామక్రిష్ణ పరమహంస, వివేకానంద, రమణ మహర్షిలకు సంబంధించిన అనేక సాహిత్యాన్ని ఆకళింపు చేసుకున్నారు.

మెహెర్‌బాబా ఆంధ్ర పర్యటనకై పూనే రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరుతున్న సందర్భంలో, మెహెర్‌బాబాను తొలిసారిగా అలా పూనే రైల్వే స్టేషన్‌లో దూరం నుంచి చూడడం జరిగింది. మెహెర్‌బాబా దివ్యరూపం ఆయన మనోఫలకంపై ఒక చెరగని ముద్రవేశింది.

ఆ దరిమలా మెహెర్‌బాబా సందేశాల పట్ల ఆకర్షితుడయ్యారు. మెహెర్‌బాబా సత్య, ప్రేమ సందేశవ్యాప్తికి నడుంబిగించారు.

బాబా అనుమతి తీసుకుని పూనేలో బాబా సెంటర్ నిర్మాణానికి పూనుకున్నాడు. 1964 మే 1న పూనే సెంటర్ ప్రారంభోత్సవానికి మెహెర్‌బాబా తప్పక హాజరుకావాలని కోరడంతో, మెహెర్‌బాబా స్వయంగా ప్రారంభించిన తొలి సెంటర్ పూనే సెంటర్





కావడం విశేషం. అంతేకాదు, పూనే బాబా సెంటర్ తొలివార్షికోత్సవ సందర్భంగా 1965 మేలో పెద్దఎత్తున బహిరంగ దర్శనం బాబా ఇచ్చారు.

పూనే సెంటర్ నిర్వహణలో కె.కె. పోషించిన భూమిక శ్లాఘనీయం.

పూనే సెంటర్ తరఫున- అవతారుని సందేశాలు ఎన్నింటినో ప్రచురణ రూపంలో ఎంతో శ్రమకోర్చి ముద్రించడాయన. అందులో ముఖ్యంగా

Meher Baba on Love, Meher baba on War, The advancing stream of life, and the secrets of sleep ప్రముఖంగా పేర్కొనాలి.

సద్గురువులు సాయిబాబా, హజ్రత్ బాబాజాన్ జీవిత చరిత్రలను శ్రీ కె.కె. గ్రంథస్థం చేశారు.

బాబా మండలి సభ్యులు డా॥ ఘనీ, పాటిల్ కాకా, ఫ్రాన్సిస్ బ్రాబజాన్, బాబా సోదరి- మణిలపై సోదాహరణ వ్యాఖ్యానం పుస్తకరూపంలో సాధికారంగా ఆయన రాశారు.

బెంగళూరుకు సమీపంలోని భైరమంగళలో 1939లో మెహెర్‌బాబా ప్రారంభించ తలపెట్టిన విశ్వ ఆధ్యాత్మిక కేంద్రాన్ని 1994లో పునః ప్రారంభింపజేయడంలో కె.కె.పాత్ర మరువలేనిది.

జీవితాంతం అవతారుని సేవలకే అంకితమైన రామక్రిష్ణన్ కడదాకా బ్రహ్మచారిగానే వున్నారు.

ఉద్యోగంలో ముందస్తుగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన శ్రీ కె.కె., పూనే సెంటర్‌లోనే శేష జీవితం గడుపుతూ అవతారుని నామవ్యాప్తికి అంకితమయ్యారు.

1999లో అమెరికాలో పర్యటించి అవతారుని నామం వినిపించిన కె.కె., ఏప్రిల్ 29న ఉదయం 7 గంటలకు అవతారుడ్ని ఆయన ప్రేమికులందరూ గొంతెత్తి ప్రార్థించే ఉదయం 7 గంటల సమయంలో, **"జై మెహెర్‌బాబా"** అని తుదిశ్వాస విడిచారు.

కె.కె. ధన్యుడు!!

**పుస్తకం ఇంకా రాలేదా??**

# హెల్ప్‌లైన్

మెహెర్‌బాబా పత్రిక పోస్టల్ బట్వాడాకు సంబందించి మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే హైదరాబాద్‌లోని ఈ క్రింది ఫోన్ నెంబర్‌లలో ఎవరినైనా కూడా సంప్రదించగలరు. **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040-27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్-94403-65640**

# అవతార్ మెహెర్‌బాబా జీవిత చరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ,
లార్డ్ మెహెర్
వాల్యూం-3 (1925-29)
**మెహెర్‌ప్రభు - వాల్యూం-3**
***- తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

అప్పట్లో, గుస్తాద్‌జీ, బాబా తమ్ముడు జాల్, పాద్రీలకి బాబా కొన్ని వెసులుబాట్లు కల్పించారు.

ఏ బరువు బాధ్యతలు అప్పగించలేదు. బాబా మాట జవదాటమని మండలి వారిలా వీరు హామీ పత్రం రాసి ఇవ్వ నక్కర్లేదన్నారు. రాయితీలని సరిగా వాడుకోవాలి కానీ, ఇతరుల్ని ఇబ్బంది పెట్టకూడదు. ఈ సంగతి పాద్రి మరచిపోయినట్లున్నారు. అందుకనే గదిలో బంధించి కూర్చొని చదరంగం ఆడుతూ గడిపసాగాడు. నా గదిలోకి ఎవ్వరూ రాకూడదని ఆంక్షవిధించాడు. గుస్తాద్‌జీ, జాల్ మాత్రం లోపలికి రావచ్చన్నాడు. మనం మనం వొక జట్టు అన్నట్లు.

పాద్రీదోరణి బెహ్రాంకి సుతరామూనచ్చలేదు. మార్చి 30వ తేదీన బాబాకి ఫిర్యాదు చేశాడు. బాబా నొచ్చుకొన్నారు. మండలి వారిని మందలించారు. సక్రమంగా నడుచుకోండని హితవు చెప్పారు.

ఇది పుణ్యక్షేత్రం. దీన్ని కించపరచకండి అని స్పష్టంచేశారు. ఇక్కడి ప్రభువు పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించకండి అని హెచ్చరించారు. మిమ్మల్ని సన్మార్గులుగా చేయాలంటే నాకు ఏకాంతవాసం తప్పదు. ఎన్నో రోజులు ఏకాంతంలో గడపాల్సివస్తుంది. అప్పుడు మీరేం చేస్తారు. మీమాననాన మీరు వుంటారా? నేను ఇలా వుండండి, అలా వుండండి, అదిచేయండి ఇది చేయండి అని చెప్పను నేను ఏమీ చెప్పను మీకు దూరంగా, నాకేమీ పట్టనట్లు నిమ్మకునీరెత్తినట్లు వుంటాను. మీరు ఎక్కడికైన వెళ్ళవచ్చు. మీరేమనుకొంటే, అది చేయవచ్చు. ఇది మీకు సమ్మతమేనా? అని అడిగారు.

ఎప్పటిలాగా, ఆవేళకూడా, మండలి వారు పెదవివిప్పలేదు. తలవంచి నిలబడ్డారు. సరే కాసేపు నిశ్శబ్దం తాండవించింది. ఏం చేయాలి, ఎలా చేయాలి అని కాసేపు చర్చ జరిగింది. బెహ్రాం మాట ప్రకారం నడుచుకోడానికి మండలి వారు అంగీకరించారు.





బెహ్రాంని మేనేజరుగా నియమించారు. కాబట్టి, అతని మాట మాకు శిరోధార్యమన్నారు. ఒక వేళ మేమెవరమైనా అతని ఆజ్ఞ ప్రకారం నడుచుకోకపోతే, వెంటనే బాబాకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ ఏర్పాటు మాకు సమ్మతమేనని పాద్రి, గుస్తాద్‌జీ, జాల్ చెప్పారు. వీళ్ళ నిర్ణయం విన్న బాబా సంతోషించారు.

మార్చి 31వ తేదీన బాబా నగర్‌కి వెళ్ళారు. అక్కడ రైల్వే కాలనీలో భజన-సంకీర్తనలో పాల్గొని సాయంత్రనికల్లా మెహెరాబాద్‌కి తిరిగి వచ్చాక మండలివారినందర్నీ ధుని దగ్గరకి పిలిపించి వో హాఫీజు సూక్తి విశిష్టత వివరించారు.

“హాఫీజు శరీరాన్ని కుండతో, ఆత్మని పొగతో పోల్చాడు. కుండపై మూతలా పెట్టిన పెద్దరాయి సంస్కారాలని అన్నారు. పొగ ఎంత దట్టంగా, ఎంత ఉధృతంగా వున్నా, కుండపై రాయిని కదల్చగలరా? ఆపని చేయగల్గింది వొక్క ఋషి పుంగవుడు మాత్రమే. ఋషి కుండపై రాతి మూతని అవలీలగా తీసిపారేస్తాడు. పంజరంలో చిక్కిన పక్షి బయట పడగలుగుతుందా. ఎంత గిలగిలా కొట్టుకొన్నా, పంజరం కొక్కెం వూడతుందా?

ఎవరైనా ఆ కొక్కెం తీయాలి. అప్పుడే పక్షి హమ్మయ్య అంటూ గాలి పీల్చుకుని రెక్కలు రెపరెప కొట్టుకొంటూ బయట పడుతుంది. రివ్వున ఎగిరిపోతుంది.

కాబట్టి, ఆధ్యాత్మిక మార్గంలో ఏ కొంచెమైనా లబ్ధికలగాలంటే, ఎంతో స్థయిర్యం కావాలి. పిడి గుద్దుల వర్షం కురిపించినా చెక్కుచెదరని గుండెకావాలి. ఇసుమంత బలంగా వుండాలి గుండె.

ఈ ప్రపంచంలో కష్టాలు, చీకులు, చింతలు అన్ని పాడు ఆలోచనల వల్లనే. ఆలోచనా స్రవంతికి అడ్డుకట్టవేయాలి.

ప్రపంచపు చింతల్ని నాపై వేసుకోబోతున్నాను. ఇందువల్ల నా ఆరోగ్యం బాగా పాడవుతుంది. కదలలేనంత నిస్సత్తువలో కూరుకు పోతాను. అప్పుడు మండలి వారు నాకు అన్నం తినిపించాల్సివస్తుంది. మంచినీళ్ళు పట్టించాల్సివస్తుంది. అందరూ నాగురించే బెంగపెట్టుకొని, అయ్యో ఎలాగా? అనుకొంటూ బెంబేలు పడతారు.

మీలో చాలా మంది నన్ను వదలివెళ్ళిపోతారు.

“ఏం జరగబోతోందో మీరే చూస్తారు.

శారీరకంగా నేను పడే బాధ ఇంతా అంతా కాదు.

జీవచ్ఛవంలా మారుతాను.

ఆదృశ్యం చూసి ఎవరూ తట్టుకోలేరు. అనంతమైన వేదన, భయంకరమైన బాధ, చిక్కి శిధిలమై పోయిన శరీరం ఆ దశలో నేను నోరు తెరుస్తాను. ఒక అతి విశిష్టమైన విలక్షణమైన ప్రయోజనం ఆశించి పెదవి కదుపుతాను. నా నోట వెలువడే ప్రతి మాటని

మానవాళి వేనోళ్ళ కీర్తిస్తుంది. నా మాటలు పరిశుద్ధమైనవి. పరమ పవిత్రమైనవి. కేవలం నా మాటల వల్లనే అద్భుతాలు జరుగుతాయి", అని బాబా అన్నారు.

ఏప్రిల్ 3న బాబా నగర్‌లో వ్యంకటేష్ శ్రీధర్ చిన్కోర్కర్ ఇంటికి వెళ్ళారు. గతంలో చాలాసార్లు అతని ఇంటికి వెళ్ళినా, ఆనాటి రాకకి వో ప్రత్యేకత వుంది. చిన్కోర్కర్ మరిపోలేని పాఠాలు చెప్పారావాళ.

గుమ్మంలోకి అడుగు పెడుతూనే, 'ఆకలి వేస్తోంది, అన్నంపెట్టండి", అన్నారు. వంట తయారు కాలేదు. ఇంకా అనగానే, టీ తీసుకురమ్మన్నారు. టీ కూడా రెడీగా లేదు. కోపం వచ్చింది బాబాకి. వెళ్ళిపోతానంటూ లేచి నిలబడ్డారు. చిన్కోర్కర్ ఖిన్నుడయ్యాడు. "బాబా కాస్తంత వోపికపట్టు. కొంచెంసేపు కూర్చో అన్ని ఏర్పాటు చేస్తాను, అని ప్రాధేయపడ్డాడు.

బాబా ప్రసన్నులయ్యారు. సరే కాసేపు కుర్చొంటానంటూనే వో చురకవేశారు. "నన్ను పిలిచే ముందుగానే అన్ని ఏర్పాట్లు రెడీగా వుంచుకోవాల్సింది" అన్నారు.

మీ ఆడవాళ్ళని పిలిపించు అన్నారు. వంటగదిలో నుంచి ఆయన భార్య బిరబిరా పరుగెత్తుకువచ్చింది. బాబా ముందు కూర్చొంది.

బాబాజాన్ జీవితంలో జరిగిన సంఘటనల్ని బాబా వివరించారు.

ఎందరో మహిళలు ఋషులు అయ్యారు. మరెందరో స్త్రీలు సద్గురువులయ్యారు. నీకు పెళ్ళయింది. ఐనా ఫరవాలేదు. భగవంతుని ఆరాధించు. భగవంతుని కోసం పరితపించు అన్నారు.

మధ్యాహ్నం భోజన సమయంలో అతిధులు రెండువరసల్లో కూర్చొన్నారు.

ఒకవరసలో హరిజనులు. రెండోవరుసలో బ్రాహ్మణులు, మరాఠాలు, పార్శీలున్నారు.

బాబా అస్పృశ్యుల పంక్తిని కూర్చొన్నారు.

ఐతే, 'నువ్వు ఇక్కడ కాదు బాబా, అలా వచ్చి రెండో పంక్తిలో కూర్చొమని చిన్కోర్కర్ ప్రాధేయపడ్డాడు. ముందు వొప్పుకోలేదు. చివరకి కాదనలేక అతని కోర్కె ప్రకారం రెండోపక్తిలో కుర్చున్నారు. ఆయనకి సుతరామూ నచ్చలేదు.

ఆ సంగతి బాబా మోహంలో కనిపించింది.

భోజనానంతరం, బాబా అనాధ శరణాలయానికి వెళ్ళారు. అక్కడ పెద్దల ఆనందానికి ఆవేళ అవధులు లేవు. పూలమాలలతో బాబాని ముంచెత్తారు. బాబా పిల్లలతో కాసేపుగడిపారు. ఒక గుడ్డిపిల్లవాడిని దగ్గరకు తీసుకొని ముద్దాడారు. వో పాట పాడమన్నారు. అతను పాట ఎత్తుకోగానే మిగిలినపిల్లలు గొంతుకలిపారు. బాబా సంతోషించారు. మధ్యాహ్నంకల్లా మెహెరాబాద్‌కి తిరిగి వచ్చారు. **(సశేషం)**





# మెహెరస్థాన్ ధర్మశాల

మెహెరస్థాన్‌లో సుమారు 300 మంది బసచేసేందుకు వీలుగా కేవలం 15 నెలల వ్యవధిలో రమారమిన 40 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన ధర్మశాల నేడు అన్ని హంగులతో బాబా ప్రేమికులకు అందుబాటులో వుంది. ఈ ధర్మశాల నిర్మాణానికి బాబా ప్రేమికులు ఎందరో ఇతోధికంగా విరాళాలందించారు. కాగా భవనాల నిర్మాణం ఒకెత్తయితే వాటి నిర్వహణ బాధ్యత, పర్యవేక్షణ మరొక ఎత్తు. మార్చి 2006 నుండి ఏప్రిల్ 2008 వరకు ధర్మశాల నిర్వహణ కోసం సుమారు రూ. 2 లక్షలు ఖర్చు చేసినట్లు, ఇదంతా కూడా బాబా ప్రేమికులిచ్చిన విరాళాలతోనే సాధ్యమయిందని ధర్మశాల నిర్వహణ బాధ్యత తలకెత్తుకున్న శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2002 నుండి నేటివరకు పలు విధాలుగా విరాళాలిచ్చినవారి వివరాలన్నింటిని తెలుగునాటగల పలు ప్రధాన బాబా సెంటర్‌లలో వుంచామని ఆయన అన్నారు.

ధర్మశాల నిర్వహణ కోసం బాబా ప్రేమికులందరూ తగిన ఆర్థిక సహాయం అందించాలని శ్రీ వై.ఎస్.రావు మరోమారు విజ్ఞప్తి చేసారు. ప్రేమికుల విరాళాలకు జమా-ఖర్చులు పారదర్శకంగా అందజేసేందుకు తాము ఎల్లవేళలా సిద్దంగా ఉన్నామని ఆయన అన్నారు. నిర్వహణకై నెలకు సుమారు ఐదారు వేలు అవసరమౌతుంది. కొంత మొత్తాన్ని బ్యాంకులో జమచేసి ఆపై వచ్చే వడ్డీని వినియోగించాలన్నది నిర్వాహకుల ఆశయం. ఈ మేరకు బాబా ప్రేమికులందరూ స్పందించగలరు.

# ఖమ్మం

ఖమ్మం బాబా సెంటర్ 45వ వార్షికోత్సవం ఏప్రిల్ 27న ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మెహెరాబాద్ నుంచి శ్రీ ఎల్.బి. థాడే ఆయన ఇద్దరు సోదరులు వారి కుటుంబ సభ్యులతోపాటు ముంబాయి నుండి డా॥ దిగంబర్ గాడేకర్ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. బాబా సాంగత్యంలో వారి అనుభవాలు, అనుభూతులు ఎంతో వివరంగా చెప్పారు. కాగా, బాబా సన్నిధిలో ఉండగా వారు పాడిన అనేక పాటలు, భజనలు వీనులవిందుగా పాడి వినిపించారు. బాబా ఎదుట ఒకసారి వీరు పాడుతుంటే, "నాకు ఈరోజు మామూలు పాటలు వద్దన్నారు బాబా. ఏదైనా ప్రత్యేకంగా పాట వుండాలన్నారు. భక్తుడు భగవంతుడిపై నిందారోపణలు చేయడం సహజం. ఐతే, కృష్ణుడు రాధపై అలిగిన వైనాన్ని కదురమ్యంగా పాడి బాబా మనస్సు దోచుకున్నామని" శ్రీ ఎల్.బి.థాడే అన్నారు. రాయల రామచంద్రయ్య నేతృత్వంలో 45 ఏళ్ళ బాబా సెంటర్ చురుకుగా మరెన్నో కార్యక్రమాలు చేపట్టనుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# బాటసారులు

స్నానమునకు రమ్మని పిలిచినప్పుడు చట్టిబాబా తనకు స్వస్థతగా లేదు. అయిష్టత చూపుట మామూలు. కొన్ని సమయములందు అతనిని పిలువవచ్చినవారిని సాధువుగా తిట్టుచుండును. బాబా గనక స్వయంగా వెళ్ళినచో వెంటనే దరహాసంతో బాలునివలె ఒక్కొకమాటే చెప్పుచు మెల్లమెల్లగా ఆయన ననుసరించి స్నానముల గదికి వెళ్ళును.

మొదట బెంగుళూరులో, బాబా ఆయన పరివారము యింకా ఇతర మస్తులు ఉండుట చూచి చట్టిబాబా కొంచెము అలజడి చెంది గుడిసెల వెనుక తోట గోడ వెంబడే వున్న దుబ్బులలోనుంచి వెళ్లెడివాడు. ఆ సందు మార్గంలో ఒక్కడే ఏదో సణుగుచూ కూర్చొనెడివాడు. ఆ ఒంటరితనంలో సుఖిస్తున్నట్లు నవ్వుకొనుచూ నేలమీద గీతలు గీయుచూ ఇతరుల ప్రమేయంలేకుండా తన యిచ్చవచ్చినటుల కాలక్షేపము చేయువాడు.

మస్తులను వారి చిత్రమగు వాంఛలను పరిశీలించుచున్న బాబా చట్టిబాబా ఏకాంతముకొరకు పడే అవస్థను జూచి ఆతనికి వేరే ఒక గుడిసెను ఏర్పాటు చేసెను. అందులో స్థిరమైన ఒక మంచమును అమర్చి అతనిని దానిపై కావలసినప్పుడు విశ్రమించమని చెప్పిరి. కాని, భోగాలాలనుడు కాని చట్టిబాబా. కఠినమైన భూమియే తన శయ్యగా అలవాటు పడినవాడు గావున, బాబా మరీ మరీ పిలిచి చెబేతేగాని ఆ మంచమును ఉపయోగించెడివాడు కాదు. బాబా యభీష్టము ప్రకారము కొద్ది రోజులు దానిపై పరున్నను తరువాత నేలమీదనే కూర్చొనుచూ నేలమీద పండుకొనుచుండెను. గుడిసె వెనుకనున్న ఆ ఇరుకుసందులో ఒంటరిగా నుండెవాడు.

తోటలో మస్తుల ఆశ్రమముకొరకు కేటాయించిన ప్రదేశము తడికలతో చుట్టూ కట్టబడియుండెను. అది మొత్తం 30 చతురపు గజముల మేరకన్న ఎక్కువ యుండదు. మస్తులు అందులో బందీలుగా ఉన్నట్లు అనుకోకుండాను వారికి విసుగు జనించకుండాను బాబా వారికి ఏమి కావలయునో కనుగొనుచు వారికి వినోదము గూర్చుటకు చేయవలసినదంతయూ చేయుచుండెను.

ఒక పాడుపడిన యింటివలె మస్తులకు కావలసిన విధముగా తేనీటి దుకాణము నొక దానిని ఎంతో అజాగ్రత్తతో నిర్మాణ చేయించిరి. అది తడికలతో కట్టబడెను. అందులో రెండు మూడు కుంటి బల్లలు. మూడునాలుగు పాత బెంచీలు వేయబడెను. తేనీరు, తమలపాకులు, పొగాకు, సిగరెట్లు, బీడీలు మస్తులకు ఎప్పుడు కావలిస్తే అప్పుడు ఉచితముగా దొరకునట్లు వుంచబడెను. దగ్గరగావున్న ఎలక్ట్రిక్ స్థంభం నుంచి తీగలాగి ఒక దీపము పెట్టించబడెను "మస్తుల హెూటలు" అని ఒక పాతబల్లమీద వ్రాయించి ఆ తడికలకు కట్టిరి. జన సంకీర్ణములయిన భారతదేశము నగరములలో సాధారణముగా పేదవారికొరకు





నెలకొల్పబడు అల్పాహార శాలలను పోలియున్నది. ఈ మస్తుహెూటలు. చట్టిబాబా ప్రాముఖ్యము పొందిన ఈ మస్తు ఆశ్రయములో తుదకు దక్షిణాదినుండి ఎక్కువగా వచ్చిన ఆరేడ్గురు మస్తులకు నివాసము కల్పింపబడెను. ఇందు గురించిన వివరములు ముందు ముందు ఈ గ్రంథములో పొందుపరుతుము ఎవరి యిష్టమొచ్చినప్పుడు వారికి తేనీరు. సిగరెట్లు, తమలపాకులు ఏది కావలసిననది పొందుటకు, వారి వారి యభీష్టప్రకారము అక్కడ మస్తులందరు సరదాగా కాలక్షేపము చేయుటకు అనువుగా నుండెను. ఈ హెూటలు పెట్టకపూర్వము చట్టిబాబా తానొక్కడు దినమునందు చాలా భాగము చెమ్మగానుండు ఆ సందులో ఉండెడివాడు. ఈ హెూటలు మస్తులందరకు సాంగత్య కేంద్రముగా నెలకొనినప్పటి నుండి చట్టిబాబా దాని కెదురుగవచ్చి గంటలకొలది మిగిలిన మస్తుల చేష్టలను దిలకించుచుండెడివాడు.

చట్టిబాబా బెంగుళూరుకు తీసికొనిరాబడిన రెండు వారములకు అహమ్మదునగర్ నుండి అక్కడకు ఒక గాయకుడు పంపబడెను. నిర్ణీత కాలములందు బాబా అందరి మస్తులను తన గదికి రావించెడివారు. అక్కడ చట్టిబాబాకు ప్రత్యేకముగా ఒక సోఫాను ఏర్పాటు చేయించిరి. మొదటి మూడు నాలుగు రోజులలోను యిష్టాగోష్టిగా జరిగే ఈ గాన కార్యక్రమమునకు చట్టిబాబా హాజరుగుచుండెడివాడు. ఒక పాట తరువాత ఇంకొకపాట పాడబడుచున్నప్పుడు ఆనందబాష్పము లాతని కన్నులనుండి కారుచుండెడివి. ఆ తరువాత ఈ గానసభకు వచ్చుట మానుకొనెను. అక్కడ కలిగే ఎక్కువ సంతోషమునుభరించుట కష్టమైనట్లు బయటనే అతడుండెడివాడు.

బాబా తాను ఎవ్వరైనా మస్తుతో ఉన్నప్పుడు ఇంకొక రెవ్వరిని అక్కడికి రానీయనందుకు కారణమును నాకు తెలిసినంతవరకు ఎప్పుడూ వివరించలేదు. చట్టిబాబా బెంగూళూరులో ఉన్నప్పుడు కలిగిన ఒకానొకఅనుభవమును ఈరుచ్ చెప్పినదానిని బట్టి ఆ విధముగా ఇంకొకరు అడ్డము వచ్చినప్పుడు భౌతికమైన అపాయము కలుగుటకు అవకాశముండునని తెలియచున్నది. అనేక పర్యాయములు చట్టిబాబాను తన గదిలో తన ఒక్కరితో కూర్చొనమని అడిగిచూచిరి. అనేక మార్లు అంగీకరించక ఆఖరికి ఒక రోజున అందులకియ్యకొనెను.

బాబా గదిలో ఇద్దరును రెండు గంటల సేపు కూర్చొనియుండిరి. బాబా తలుపు తెరుచునుద్దేశముతో లేవగానే ఈరుచ్ బయటపెట్టిన గొళ్ళెమును తీసెను. చట్టిబాబా బయటికి వచ్చి ఈరుచ్ దగ్గరనుండి రాచుకొనుచూ తన గదికి వెళ్ళి పోయెను. అతడట్లు నిర్గమించినప్పుడు తన శరీరమునకు స్పర్శ కలిగినప్పుడు (ఎలక్ట్రిక్ షాక్) విద్యుదాఘాతమువలె బాధ కలిగించెడి ఒక శక్తి అతని దేహము నందు ప్రవహించెనని ఈరుచ్ విశదముగా చెప్పెను. భారతదేశమునందు సాధు పురుషులు సమాధియందుండగా వారికి ఏ విధమయిన అభ్యంతరము కలిగించ రాదను సంప్రదాయములనేకములు కలవు. ఈ మహాపురుషులిరువురి సాంగత్యమువలన కలిగిన శక్తి విజృంభణకు ఇదియెక వాచవి యని చెప్పనగునేమో. (సశేషం)

## బాబా చెప్పిన కథ

# అయాజ్

–బి.క్రిష్ణయ్య
రిటైర్డ్ సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

"మెహెర్‌బాబా" తన మండలి సభ్యులనుద్దేశించి ఒక సందర్భంలో ఒక పాత కథ వినిపించారు. ఆ కథ 'ఆయాజ్' అనే ఒక బానిసకు చెందినది.

ఆరోజుల్లో బానిసత్వం విస్తృతంగా వుండేది కదా!!

'ఆయాజ్' ఒక నమ్మకమైన, బానిసగా వున్నాడు. అతని నిజాయితి గురించి తెలుసుకుని ఆనాటి చక్రవర్తి ఆయాజ్‌ని తన బానిసగా నియమించుకున్నాడు. అయాజ్ రాజ కుటుంబానికి విశ్వాసపాత్రునిగా, నమ్మకస్తుడుగా రాజుగారి కనుసన్నలలో మంచివానిగా వున్నాడు. ఇది చాలా మంది ప్రముఖులకి నచ్చలేదు. అసూయ కల్గింది.

తన ఆస్థానములోని ముఖ్యులే అయాజ్‌పై ఈర్ష చెందడం చూసి చక్రవర్తికి కూడా ఆశ్చర్యమేసింది. అయాజ్‌పై జాలిపడ్డారు. తన ఆస్థానంలోని వారికి కనువిప్పు కల్గించాలని రాజగారు భావించారు. అందుకుగాను తన మంత్రులందరిని సమావేశ పరిచారు. రాజుగారు తన చేతివ్రేలికున్న రాజముద్రికను ఒక బల్లపై వుంచారు.

ప్రతి వారిని పిలిచి ఆ ముద్రిక వెలకట్టమన్నారు. ఒక్కొక్కరు ఒక్కోరీతిన స్పందించారు. ఎవరికి తోచిన విధంగా తలా ఒక రీతిలో వెలకట్టారు. చివరాఖరుకు సరైన ధరకట్టడం కోసం ఒక నగల వ్యాపారిని పిలిపించి ఆ ఉంగరము వెల నిర్ణయించాలని భావించారు.

చక్రవర్తి ఈ 'తమాషా' గమనిస్తున్నారు.

'అయాజ్"ను పిలిచి ఉంగరానికి అతను కట్టే వెల ఎంతని అడిగారు. 'అయాజ్' ఆ ఉంగరాన్ని తన చేతిలోకి తీసుకొని, తిరగి బల్లపై వుంచి, "రాజా! ఈ ఉంగరం బల్లపై వున్నంతవరకూ దీని విలువ స్వల్పమే. మీ చేతి వ్రేలికి ఉన్నట్లయితే ఉంగరం వెల నిర్ణయించడం దుర్లభం, చాలా కష్టం– అని జవాబిచ్చాడు.

"మెహెర్‌బాబా" ఈ కథను చెబుతూ మీరందరూ తెలుసుకోవల్సిన సత్యమేమిటంటే





మీరు నా కొంగును గట్టిగా పట్టుకున్నంత వరకూ మీకెవరూ వెలకట్టలేరని, కడదాకా నా నామస్మరణ చేస్తుండమని తన ప్రేమికులను అవతారుడు హెచ్చరించారు.

## మరొకటి

"మెహెర్‌బాబా" తన ప్రేమికులనుద్దేశించి మరో సందర్భంలో ఇలా చెప్పారు. ఈ కథ కూడా "ఆయాజ్"ను ఉదహరించే చెప్పారు. ఒకరోజున చక్రవర్తి తన దగ్గరున్న వజ్ర వైఢూర్యాలను ఖజానాలోనున్న సర్వసంపదను బహిరంగంగా ప్రదర్శిచనున్నానని ప్రకటించారు.

ఇలా ప్రదర్శిస్తే భద్రత ఏముంటుందని మంత్రులు సలహా ఇచ్చారు. ఆ హెచ్చరికలను చక్రవర్తి ఖాతరు చేయలేదు. ఖజానాలోని వజ్ర, వైఢూర్యాలను, విలువలైన రత్నాలను బంగారు నగలు, నాణేలు అన్నింటినీ బుట్టలలో ఉంచి, ఆ బుట్టలను ఒంటెల మూపురంపై ఊరేగింపుగా తీసుకెళ్ళారు.

మంత్రులు, పురప్రముఖులు, సైనికులు ఊరేంగింపులో పాల్గొన్నారు.

ఊరేగింపు ఇరుకైన సందులగుండా సాగుతుంది. ఈ ఊరెగింపులో అందరికంటే ముందు, అగ్రభాగాన 'అయాజ్' వుండి నాయకత్వం వహించాడు.

చక్రవర్తి ఎవ్వరికీ తెలియకుండా ఈ విలువైన ఆభరణాలుంచిన బుట్టలకు చిన్న–చిన్న రంధ్రాలు వుంచారు. ఊరేగింపు ఇరుకైన వీధుల గుండా సాగుతూ వుంటే, ఒంటెలపై నుంచిన బుట్టలు వీధి గోడలకు రాసుకొని, చిన్ని చిన్ని రంధ్రాల ద్వారా బుట్టలలోని ఆభరణాలు ఒక్కొక్కటిగా దారి వెంబడి పడిపోసాగాయి.

ఊరేగింపు కొంత వరకు సాగినాక, చక్రవర్తి వెనక్కు మరలి చూస్తురు కదా–. ఆశ్చర్యం!! అప్పటిదాకా వున్న మంత్రులు, పురప్రముఖులు ఏ ఒక్కరూ "తనవెంట" వస్తున్నట్లులేదని ఆయన గమనించాడు. కేవలం ఆయాజ్ మాత్రం రాజుగార్ని అంటిపెట్టుకొని ముందుకునడుస్తున్నాడు.

ఇది చూసి, వీళ్ళంతా ఏమయ్యారని చక్రవర్తి వాకబుచేస్తే, అందరూ నేల రాలిన రత్నాలు, బంగారునాణేలు, ఆభరణాలు ఏరుకోవడంలో నిమగ్నమయ్యారని తెలుసుకున్నాడు చక్రవర్తి,

అయాజ్ వైపు చూస్తూ, అందరూ వెళ్ళారుకదా, నీవెందుకు వెళ్ళలేదని ప్రశ్నించగా, రాజా! నీ ప్రక్కన నేనుంటే, నీవు నా ప్రక్కనే ఉంటే, ఈ ఆభరణాలు నాకెందుకు! నీవే నా 'భోగ–భాగ్యాలని' బదులిచ్చాడు.

మెహెర్‌బాబా ఈ కథనుముగిస్తూ, తన ప్రేమికులు తన చెంతనే ఉంటే వారికి మరిక భోగాభాగ్యాలతో పనేమిటన్నారు. –

ఆలోచించండి మీరూ.

## మా మాటలు

### పెండ్లిపిలుపు

శ్రీమతి వై. సత్యమణి శ్రీ వై. విజయసారథి, తాడేపల్లిగూడెం గారి కనిష్ట పుత్రిక చి॥ల॥సౌ॥ డా॥ కస్తూరి చందన వివాహము చి॥ నాగసతీశ్ తో తేది 24.04.08 రా॥ 3.51 ని॥లకు వాసవీ కన్యకాపరమేశ్వరీ కళ్యాణ మండపం తాడేపల్లిగూడెంలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

### పెండ్లిపిలుపు

చి॥ల॥సౌ॥ సాహితి (శైలజ) వివాహము చి॥ శ్రీనివాసస్వామి తో తేది 30.04.08 బుధవారం ఉదయం గం॥ 11.05 ని॥లకు సాయిమేఘన ఫంక్షన్‌హాల్, ఇల్లంతకుంట రోడ్, కొత్తపల్లి - జమ్మికుంటలో ఏర్పాటుచేసినట్లు శ్రీ పరాంకుశం రుక్మిణి-వేంకటేశ్వరస్వామి ఆహ్వానం పంపారు.

### పెండ్లిపిలుపు

చి॥ శ్రీనివాస్ వివాహము చి॥ల॥సౌ॥సాధనతో తేది 25.04.08 శుక్రవారం రోజున ఉదయం రాత్రి గం॥ 8.24 ని॥లకు కామధేను ఇండస్ట్రీస్ (రైస్‌మిల్), రామాయంపేట, మెదక్ జిల్లాలో ఏర్పాటుచేసినట్లు శ్రీమతి&శ్రీ కందుకూరి వీరమణి-నర్సింలు ఆహ్వానం పంపారు.

### స్వర్ణోత్సవ సహవాస్

2008 15,16,17 తేదీలలో మెహెరాబాద్‌లో జరిగిన స్వర్ణోత్సవ సహవాస్‌లో వెల్లడించిన మరికొన్ని అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

శామ్ కేరావాలా తన ప్రసంగంలో బాబా హాస్య ప్రవృత్తిని ముచ్చటిస్తూ - ఒక ప్రేమికుడు కవాలీ పాడుతూ "నాకు దాహం తీర్చనపుడు నీవు ప్రేమసాగరుడవెలా అవుతావు" అనే చరణం మళ్ళీ మళ్ళీ ఆపమన్నా ఆపకుండా పాడుతాడు. బాబా అతనికి ఒక కప్పు కాదు, రెండు కప్పులు టీ తెప్పించి యిచ్చారు.

రామ్ దులారీ అనే ప్రేమికుడు 1958 సహవాస్‌కు అమెరికా నుండి 2 రోజుల క్రితమే వచ్చాడు. "నేను నీకు తెలుసా?" అని బాబా అతనిని అడుగుతారు. నీవు నాకు బాగా తెలుసు అని అతని సమాధానం విన్న బాబా, మండలి వైపు తిరిగి మీరు ఎన్నో సంవత్సరములనుండి నావద్ద ఉంటున్నా, నేనెవరో మీకు తెలీదు. చూశారా రెండు రోజుల క్రితం వచ్చినా యితడునన్ను తెల్సుకున్నాడు" అని చమత్కరించారు.

- కుప్పిలి సత్యనారాయణ, విశాఖ





# పుస్తక సమీక్ష
## BABA'S GRACE

ఇది వార్నియర్ సింగ్ సాహనీ అనే సిక్కు సోదరుని ఆత్మకథ. ఈ వార్నియర్ సింగ్ బాబా యొక్క అత్యంత ప్రియమైన ప్రేమికుడు, ప్రీతం సింగ్ మెహెర్ యొక్క కుమారుడు. ఈ ప్రీతంసింగ్ బాబాకు చాలా ముఖ్యమైన అయిదుగురు సిక్కు ప్రేమికులలో ఒకరు. ఈ అయిదుగురు ప్రేమికులు వీరేందర్ సింగ్, ప్రీతమ్ సింగ్ మెహెర్, ప్రిన్సిపాల్ నిరంజన్ సింగ్, ప్రొఫెసర్ జోగిందర్ సింగ్, డాక్టర్ దౌలత్‌సింగ్.

ఈ అయిదుగురు ప్రేమికులను గురించి 'పంజ్‌పారే' అనే పేరుతో ఒక పుస్తకము యిది వరకు వెలువడినది. అది ఇంగ్లీషులో వ్రాయబడి ఉన్నప్పటికీ దాని అనువాదములు హిందీలోను, తెలుగులోను ప్రచురింపబడినవి.

ప్రస్తుత పుస్తకము- "బాబాస్ గ్రేస్‌లో" సో॥ వార్నియర్ సింగ్ తన జీవితములో సంభవించిన అనేక సంఘటనలను, తాను ప్రియతమ మెహెర్ బాబా పరిధిలోనికి ఎట్లు వచ్చినది చక్కగా వ్రాసినాడు. ఆయన జీవితంలో అనుభవించిన సుఖదుఃఖాలను చాలా స్పష్టంగా వివరించినాడు. దీనిని చదువుతూ ఉంటే ప్రియతమ మెహెర్‌బాబా మనముందు ప్రత్యక్షంగా ఉన్నట్లు అనుభవం కలుగుతుంది. ఈ పుస్తకంలో 17 అధ్యాయములు ఉన్నవి. ప్రతి బాబా ప్రేమికుడు చదివి ఆనందించ తగిన పుస్తకము. పుస్తకము ధర తెలియపరిచలేదు. గ్రంథకర్త చిరునామా -Warmier Singh Sahni, S/o S.Pritam Singh Meher, DDA Flat No.39, Block A-C 3, Shalimar Bagh, Delhi - 110088 సంప్రదించగలరు.

- డా॥ MBVIR శర్మ, Hyderabad

# మెహెర్ డిజిటల్ ఆడియోస్

2007 నవంబరు 4న **"అనపర్తి సంపూర్ణ సంకీర్తనా లహరి"** సహవాస్‌లో ప్రముఖ గాయకులు సో॥ సి.వై.చింతామణి, సి.జి.శర్మ, మల్లిక్ బృందం, శ్రీమతి సుశీల తదితరులు అలాపించిన బాబా పాటలను రెండు సిడిలుగా రూపొందించామని శ్రీ పెదమల్లు సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఒక్కొక్క సిడి ఖరీదు రూ.30/- అని తెలిపారు.

ఈ పాటల సిడిలు పొందగోరువారు

పెదమల్లు సుబ్రహ్మణ్యం, మెహెర్ డిజిటల్ ఆడియోస్, డోర్ నెం.9-13-14, ఉడత్తు వారి సందులో, ఖాజీ వీధి, రాజమండ్రి- 533101, సెల్- 9866594494 సంప్రదించగలరు.

## శ్రీమతి లలితాంబ మృతి

శ్రీ చుండూరి నాగేశ్వరరావు గారి భార్య శ్రీమతి లలితాంబ, చల్లపల్లి 05.04.2008 శనివారం ఉదయం 8.30 గం॥లకు బాబా నామాన్ని జపిస్తూ మెహెర్ భగవానుని పిలుపుమేరకు బాబాలో లీనమయ్యారని చక్కా నాగ వేంకట శీతారామయ్య తెలిపారు.

## మెహెర్‌స్థాన్

11.05.2008 రెండవ ఆదివారము మెహెర్‌స్థాన్, కొవ్వూరులో 98వ సహవాస్ కార్యక్రమము అవతార్ మెహెర్‌బాబా అనకాపల్లి సెంటరు వారి సహకారముతో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతి శర్మ, విశాఖపట్నం, శ్రీ సి. శివయ్య, అడ్వకేట్, అనకాపల్లి తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

## మంచిర్యాల

**(విహారి)**

మంచిర్యాల కేంద్రం 18వ వార్షికోత్సవం 12.04.2008న వైభవంగా జరిగింది. ఉదయం నగర సంకీర్తన, సప్తవర్ణ పతాకావిష్కరణ శ్రీ పి.ఎస్.కె. శర్మ, ధుని ప్రజ్వలన శ్రీ ఎస్.ఆంజనేయులు చేసారు. భజనలు తర్వాత సహవాస్ కార్యక్రమం జరిగింది. శ్రీ కె. విశ్వేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీ కె. కిషన్‌రావు, కరీంనగర్ మాట్లాడుతూ " నేను విద్యార్థిగా ఉన్నపుడు బాబా భజనలు వింటూ ఉండేవాడిని. ఆ రోజుల్లో బాబా గురించి తెలియదు. కాని, భజనలు వినసొంపుగా ఉండేవి. వకీలు అయిన తర్వాత కారు, యిల్లు, అమర్చుకుంటే జీవితం అంతా భగవంతుడి సేవచేస్తాను అని వెంకటేశ్వర స్వామిని మొక్కుకున్నాను. కోరిక తీరింది. బాబా పరిచయం అయింది. కరీంనగర్ లో బాబా కేంద్రం నిర్మించాము. భగవత్ప్రేరణ ఈ రకంగా (బాబా సేవ) దొరికింది. 100% నమ్మకం ఉంటె తప్పక అనుగ్రహం లభిస్తుంది" అన్నారు. శ్రీ జనార్ధనరావు మాట్లాడుతూ "బాబా ప్రేమను అనుభవించి ఆనందించండి. మనకు రెండు తెలుగు మాసపత్రికలు మెహెర్‌బాబా, అవతార్ మెహెర్‌లు తగిన సమాచారం యిస్తున్నాయి. చదివి స్పందించండి. మెహెరాబాద్ సందర్శించండి హృదయాన్ని ఆయన నామంతో పునీతం చేయండి" అని అన్నారు.

శ్రీ సామల మల్లయ్య, సిరిసిల్ల, మాట్లాడుతూ "మనమంతా బాబా సమకాలీకులం. కనుక అదృష్టవంతులం. స్వార్థ రహితమైన, పవిత్ర, నిష్కల్మషమైన దివ్యప్రేమ అవసరం అని అన్నారు. అది అందివ్వడానికే బాబా అవతరించారు. సర్వ భవరోగములకు తారక





మంత్రం "బాబా" నామం అని అన్నారు. ప్రేమ-త్యాగం ఈ రెండు కవలలు అని అన్నారు.

శ్రీ రంగ నాథస్వామి మాట్లాడుతూ "భక్తరామదాసుకు ఉన్న ఆత్మీయత మనకు రావాలి. శ్రీ అన్నారావు, నిర్మల్, శ్రీ వామనరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్, కరీంనగర్ ప్రసంగించారు. శ్రీ బి.రామక్రిష్ణయ్య మాట్లాడుతూ మనకు కల బంధనాల వల్ల భగవంతుడుండె హృదయంలో అసత్యాన్ని మధురంగా నింపుతున్నామన్నారు. భగవంతుడి దయకు అర్హత సాధించాలి. బాబాకి అయిష్టమైన కపటం విడనాడాలి, అన్నీ ఉన్నా దుఃఖానికి కారణం తృప్తి లేకపోవడమేనని ఆయన అన్నారు.

## 'నడిపూడి'

17.4.2008 గురువారం రాత్రి 4-23 ని॥కు మేర్వాన్ టూర్స్ & ట్రావెల్సు అధినేత చి॥ అరిగెల వీర వెంకట సత్యసూర్యనాగ ఏసు ధర్మారావు (రాజా)కు చి॥ల॥సౌ॥ వరలక్ష్మి తో అమలాపురంలో శ్రీ రాజరాజేశ్వరి కళ్యాణ మండపము నందు వివాహము జరిగినది. దీనిని పురస్కరించుకొని వారి స్వగ్రామం "నడిపూడి" నందు 19.04.08న మల్కిపురం జి.రామారావు బృందమువారి మెహెర్‌భజన, శ్రీమతి వేణూకుమారి గారి (ఏలూరు) ఉపన్యాసము, మల్లిక్ బృందమువారి - మెహెర్ సంకీర్తనము, శ్రీ భాగేశ్వరరావు గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

## కోడూరి కృష్ణ మోహన్ మృతి సంతాపం

మెహెర్‌శ్రీ కోడూరి శివరామకృష్ణ తులసీవర ప్రసాద్, వారి కుమారుడు, మెహెర్ శ్రీ కోడూరి కృష్ణమోహన్ 28.3.08న ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో బాబాలో ఐక్యమైనారని తెలిసి బాబా ప్రేమికులందరం దిగ్భ్రాంతికి లోనైనాము. ఈ సందర్భముగా వారి కుటుంబానికి బాబా యొక్క అపారమైన ప్రేమ తోడుగా వుండాలని వారి ఆత్మకు శాంతి కలగాలని మెహెర్‌బాబా సెంటర్, సుబ్బారావుపేట, తాడేపల్లిగూడెం నందు మౌనం పాటించామని తెలియజేయుచున్నాను.

శ్రీమతి జక్కా సత్యవతి గారు "రామారావుపేట, తాడేపల్లిగూడెం, మెహెర్‌బాబా సెంటర్ స్థలదాత 21.3.2008న బాబాలో ఐక్యమైనారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్‌లో బాబా ప్రేమికులు పార్థనలు జరిపి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి, సంతాపం తెలియజేసితిమి.

**-బసవన్న,తాడేపల్లి గూడెం**

## జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు)
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. ఏదేని కారణాలచేత మీరు చెల్లించిన జీవిత సభ్యత్వం వాపసు కోరిన ఎడల తక్షణమే వడ్డీ లేకుండా తిరిగి పంపగలమని హామీ.
4. వార్షిక సభ్యత్వం రూ.100/-
5. మీరు పంపే నగదు పోస్టలు మనీ ఆర్డర్ ద్వారా పంపితే ఉభయకుశలోపరి. మీకు పోస్టలు శాఖవారి రశీదు లభిస్తుంది.

బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు.

## వెయ్యి రూపాయలు - జీవిత సభ్యత్వం
## 2008 మే నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | తేది | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | 00.05.2008 | శ్రీ బాల సరస్వతీ మండల పరిషత్, గ్రంధాలయం, చేబ్రోలు ఉంగుటూరు మండలం, ప॥గో॥జి. | రు. 1000.00 |
| 2. | 00.05.2008 | ఇవటూరి పద్మావతి, విశాఖ పట్నం | రు. 1000.00 |
| 3. | 00.05.2008 | జి. కాశీధర్ , ధర్మవరం | రు. 1000.00 |
| 4. | 00.05.2008 | యం.యస్. మణి, మచిలీపట్నం | రు. 1000.00 |
| 5. | 00.05.2008 | రవిరాం, హైదరాబాద్, | రు. 500.00 |
| 6 | 00.05.2008 | ఎ. సురేష్‌బాబు, విశాఖపట్నం | రు. 1000.00 |
| 7. | 00.05.2008 | వై. రాజేశ్వర్ రావ్, చెన్నైయ్ | రు. 1000.00 |
| 8. | 00.05.2008 | వి.ఎస్.ఆర్.మూర్తి, నరసరావుపేట, | రు. 1000.00 |
| 9 | 00.05.2008 | ఎన్. లింగం, నిజామాబాద్ | రు. 100.00 |
| 10 | 00.05.2008 | మెహెర్ మణి, ఎ.ఎస్.రావ్‌నగర్ | రు. 500.00 |
| 11. | 00.05.2008 | జె.కుమారస్వామి, విశాఖపట్నం | రు. 500.00 |
| | | **మొత్తం** | **రు. 8600.00** |





# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వద్విగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు,
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేనివాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతట గలవు,
నీవు అన్నింట నున్నావు
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమున గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడులోకములలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయలను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాప్తివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య,
జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోన్నతుడవు,
నీవు పరుడవు,
పరమేశ్వరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.